Follow: @ANNTELUGU
21-06-2025
# మహా పత్రిక
ANN తెలుగు
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 198 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఒంటికి యోగా.. మంచిదేగా
### నేడే.. యోగా డే
ప్రత్యేక కథనం 4లో

**టాప్ న్యూస్**



## ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా
- నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు
- అమెరికా పర్యటన కంటే ఒడిశాకే తన ప్రాధాన్యత అన్న ప్రధాని మోదీ

03



## ఈఎన్‌సీ అనిల్‌కు షాక్!
- మేడిగడ్డ ఎఫెక్ట్ తో బదిలీ వేటు
- పోస్టింగ్ లేకుండా రిపోర్ట్ చేయాలని ఆదేశం
- గ్రౌటింగ్ అంశంలో ప్రభుత్వ ఆగ్రహమే కారణం
- ఈఈ శ్రీధర్ విషయంలో కలగజేసుకున్నారని ఆరోపణలు

02



## ప్రజా సమస్యలపై రెండు పార్టీలు నిర్లక్ష్యం చేశాయి
- పోరాడుతున్న బీజేపీని అడ్డుకుంటున్నాయి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

03



## లాభం ఆంధ్రాకు.. నష్టం తెలంగాణకు
- 7 మండలాలు ఏపీకి అన్యాయంగా ఇచ్చారు
- పోలవరం ముంపు గ్రామాలు తెలంగాణకు తిరిగివ్వాలి
- దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు

వివరాలు 4లో




దేశ చరిత్రలోనే అతిపెద్ద
## ఫోన్ ట్యాప్ ఇదే
- అంతా కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగింది
- చివరకు కవిత ఫోన్ కూడా ట్యాప్ చేయించారు
- గోనె ప్రకాశ్ రావు సంచలన వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు హాజరైన కాంగ్రెస్ నేత

వివరాలు 4లో

# బండి టార్గెట్‌గా నాటి ప్రభుత్వ అరాచకాలు

### సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లను ట్యాప్ చేసిన పోలీసులు
- సిట్ విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న విషయాలు
- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఫోన్ ట్యాప్ చేసినట్లు నిర్ధారణ
- ప్రవీణ్ రావుకు ఫోన్ చేసిన సిట్ పోలీసులు
- 317 జీవో, టెన్త్ పేపర్ లీకేజీ, భైంసా అల్లర్లు సహా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు ఘటనల్లో సంజయ్ తోపాటు వెన్నంటే ఉన్న ప్రవీణ్ రావు



“ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మంది రాజకీయ నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్న బండి సంజయ్ లక్ష్యంగా 100కు పైగా కేసులు నమోదు చేసిన విషయం విదితమే. తనను రాజకీయంగా ఎదుర్కోవడం చేతగాని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా తన ఫోన్ తోపాటు తన కుటుంబ సభ్యుల, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారంటూ బండి సంజయ్ గతంలో పలుమార్లు కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు నిజమని ప్రస్తుతం తేలింది. - మహా

వివరాలు 2లో



# ఏపీతో వివాదం కోరుకోవడం లేదు
### బనకచర్లపై ఏపీ సీఎంతో చర్చకు సిద్ధం
- ఎవరికోసమో తెలంగాణ ప్రయోజనాలను వదులుకోం
- 23న కేబినెట్‌లో చర్చించి నిర్ణయం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

**న్యూఢిల్లీ, మహా :** బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తాము ఎవరితో వివాదాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 23వ తేదీ కేబినెట్ సమావేశం జరుగుతుందని, ఈ భేటీలో చర్చించిన తర్వాత చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని తెలిపారు. అవసరమైతే నేనే స్వయంగా చంద్రబాబునాయుడును చర్చలకు రావాలని ఆహ్వానిస్తానని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణని ఏపీ మొదట ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడమే తమ అభ్యంతరమని తెలిపారు.

మిగతా 2లో

## గోపన్‌పల్లి భూ వివాదం కేసు
- సీఎం రేవంత్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు
- రేవంత్ రెడ్డిపై 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు

వివరాలు 3లో

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్
### రూ.14 వేల కోట్లతో పనులు
- కొత్త టెర్మినల్, అదనపు రన్ వేల నిర్మాణం
- 2026లో మొదలు పెట్టి 2029లో పూర్తి చేయాలని లక్ష్యం

**మహా :** హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమాన సేవలకు కేంద్రంగా ఉన్న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం భారీ విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రయాణికుల రద్దీ, విమాన రాకపోకలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ.14,000 కోట్లతో విస్తరించాలని యోచిస్తోంది. రానున్న కాలంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ కనెక్టివిటీకి ఒక కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ బృహత్తర ప్రాజెక్ట్‌ను చేపడుతున్నారు. ఈ విస్తరణ నగరం ఆర్థిక వృద్ధికి, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి గణనీయంగా దోహదపడనుంది.

మిగతా 3లో





## కడియం శ్రీహరి.. ఇది టీడీపీ కాదు!
### నా ముందు కూర్చోవడానికి ఎందుకింత నామోషీ?
- సీఎం రేవంత్, పొంగులేటికి నాపై కంప్లైంట్ ఎందుకిస్తారు?
- నా పదవి పోతుందని తప్పుడు ప్రచారమెందుకు?
- నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధి అడ్డుకుంటున్నాడు
- భద్రకాళి టెంపుల్ మీ సొత్తు కాదు.. రాజేందర్

02

# లిమిట్స్ దాటొద్దు..
### మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా
- పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ హెచ్చరిక
- కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం
- మంత్రులు శాఖకు పరిమితమైతే మంచిది
- ఉప ఎన్నికపై అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదు

**హైదరాబాద్, మహా:** ఇటీవల సొంత పార్టీ లీడర్లపై కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఆయనకు సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్టు వివరించారు.

మిగతా 2లో



# బండి టార్గెట్‌గా నాటి ప్రభుత్వ అరాచకాలు

## సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లను ట్యాప్ చేసిన పోలీసులు

- సిట్ విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న విషయాలు
- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు ఫోన్ ట్యాప్ చేసినట్లు నిర్ధారణ
- ప్రవీణ్ రావుకు ఫోన్ చేసిన సిట్ పోలీసులు
- 317 జీవో, టెన్త్ పేపర్ లీకేజీ, బైంసా అల్లర్లు సహా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు ఘటనల్లో సంజయ్ తోపాటు వెన్నంటే ఉన్న ప్రవీణ్ రావు



మహా : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మంది రాజకీయ నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్న బండి సంజయ్ లక్ష్యంగా 100కు పైగా కేసులు నమోదు చేసిన విషయం విదితమే. తనను రాజకీయంగా ఎదుర్కోవడం చేతగాని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా తన ఫోన్ తోపాటు తన కుటుంబ సభ్యుల, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారంటూ బండి సంజయ్ గతంలో పలుమార్లు కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు నిజమని ప్రస్తుతం తేలింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేస్తున్న సిట్ బృందం బండి సంజయ్ ఫోన్ ను కూడా ట్యాప్ చేసినట్లు గతంలోనే నిర్ధారించింది. తాజాగా ఆయన వ్యక్తిగత సిబ్బంది, సన్నిహితుల ఫోన్లను సైతం ట్యాప్ చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. సిట్ పోలీసులు బండి సంజయ్ ప్రధాన అనుచరుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు ఫోన్ ట్యాపింగ్ అయినట్లు నిర్ధారించారు. ప్రవీణ్ రావుకు ఫోన్ చేసి "మీరేం చేస్తుంటారు? గతంలో మీ ఫోన్ ట్యాప్ చేశారు. మీకు నోటీసులు పంపిస్తాం. విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. అందుబాటులో ఉండండి" అని సిట్ పోలీసులు తెలిపారు.

బోయినిపల్లి ప్రవీణ్ రావు తొలి నుండి బండి సంజయ్ వెన్నంటి ఉన్నారు. బండి సంజయ్ 3సార్లు ఎమ్మెల్యేగా, 2సార్లు ఎంపీగా, కార్పొరేటర్ గా పోటీ చేసిన సమయంలో సంజయ్ రాజకీయ వ్యవహారాలను చూసేవారు. గత కొన్నేళ్లుగా సంజయ్ వ్యక్తిగత సహాయకుడిగా, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గ కన్వీనర్ గా కొనసాగుతున్నారు. నియోజకవర్గ పర్యటనలు, వివిధ కార్యక్రమాల అమలు బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రస్థాయిలో ఎండగట్టడంతో పాటు ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తూ ప్రజలతో మమేకం అవుతున్న సమయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యక్రమాల బాధ్యతలను ప్రవీణ్ రావు చూసేవారు. ముఖ్యంగా 317 జీవో, టెన్త్ హిందీ పేపర్ లీకేజీ, బైంసా అల్లర్లు, ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కరీంనగర్ లో జరిగిన అల్లర్లు, మనువాదాన్ని అడ్డుపెట్టుకుని భరతమాతను కించపర్చిన వ్యవహారంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద పతాక స్థాయిలో జరిగిన ఆందోళనసహా అనేకమైన ముఖ్యమైన సంఘటనల్లో బోయినిపల్లి ప్రవీణ్ రావు బండి సంజయ్ వెన్నంటే ఉన్నారు. అనేక ప్రజా ఉద్యమాల కేసుల్లో సంజయ్ తోపాటు ప్రవీణ్ రావును కూడా నిందితుడిగా చేర్చారు.

317 జీవో విషయంలో కరీంనగర్ ఎంపీ కార్యాలయంవద్ద పెద్ద ఎత్తున బండి సంజయ్ చేసిన దీక్ష, టెన్త్ హిందీ పేపర్ లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 317 జీవో దీక్షను అడ్డుకోవాలంటూ కేసీఆర్, కేటీఆర్ ల నుండి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక పోలీసులు ఏకంగా ఎంపీ కార్యాలయాన్ని బద్దలు కొట్టి బీజేపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడులు చేసి సంజయ్ ను అదుపులోకి తీసుకున్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నాటి కరీంనగర్ పోలీస్ కమిషనర్ ప్రస్తుతం ఐజీగా ఉన్న సత్యనారాయణ ఏకంగా ఆ ఘటన సమయంలో అక్కడే ఉన్న ప్రవీణ్ రావును ఉద్దేశించి "నీ ఫోన్ నీ దగ్గర ఉందనుకుంటున్నావ్. నీ జాతకం అంతా నా దగ్గర ఉంది. నువ్వు ఏమేం చేస్తున్నావో మాకు తెలుసు. నీ అంతు చూస్తా. నీ పొలిటికల్ కెరీర్ ఖతం చేస్తా"నంటూ హెచ్చరిస్తూ ఆయనను అదుపులోకి తీసుకుని ఇబ్బంది పెట్టారు. అట్లాగే టెన్త్ పేపర్ లీకేజ్ పేరుతో అర్ధరాత్రి కరీంనగర్ పోలీసులు బండి సంజయ్ నివాసంలోకి చొరబడి ఆయనను ఎత్తుకుపోయి తెల్లవార్లు అనేక స్టేషన్లు తిప్పుతూ ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. సంజయ్ పై కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నమోదైన దాదాపు అన్ని కేసుల్లోనూ బోయినిపల్లి ప్రవీణ్ రావును నిందితుడిగా ఉన్నారు. టెన్త్ పేపర్ లీకేజీ సమయంలోనూ నాటి సీఐ తుల శ్రీనివాసరావు సైతం తన సంగతి చూస్తామంటూ బెదిరించడంతోపాటు తనపట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రవీణ్ రావు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బైంసా అల్లర్లు, హిందూ ఏక్తా యాత్ర, కరీంనగర్ లో ఇండియా గెలిస్తే నల్లజెండాలతో నిరసన తెలిపిన ఒక వర్గం నాయకులతో జరిగిన ఘర్షణ, శాతవాహన వర్సిటీ ఆందోళనలోనూ బండి సంజయ్ కు వెన్నంటి ఉంటూ బోయినిపల్లి ప్రవీణ్ రావు ముఖ్య పాత్ర పోషించారు. సంజయ్ నాడు చేపట్టిన కార్యక్రమాలన్నీ పెద్ద ఎత్తున సక్సెస్ కావడం, తద్వారా ప్రభుత్వ వ్యతిరేకత పెల్లుబీకడుతుండటంతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బండి సంజయ్ కొరకరాని కొయ్యగా మారడంతో బండి సంజయ్ ను దెబ్బతీసేందుకు ఆయన ఫోన్లను ట్యాప్ చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు బండి సంజయ్ రాజకీయ కార్యక్రమాలతోపాటు, నియోజకవర్గ పర్యటనలు, సభలు, సమావేశాల ఖరారు వంటి అంశాలను ప్రవీణ్ రావు పర్యవేక్షిస్తుండటంతో ఆయన ఫోన్లను సైతం ట్యాప్ చేయడం ద్వారా బండి సంజయ్ చేపట్టబోయే కార్యక్రమాలను ముందే నిలువరించడంతోపాటు సంజయ్ ను రాజకీయంగా దెబ్బతీయవచ్చని కేసీఆర్ ప్రభుత్వం ప్లాన్ వేసి చట్టవిరుద్ధంగా పోలీసులను అడ్డుపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్ చేసింది.

# కడియం శ్రీహరి.. ఇది టీడీపీ కాదు!

- నా ముందు కూర్చోవడానికి ఎందుకింత నామోషీ?
- సీఎం రేవంత్, పొంగులేటికి నాపై కంప్లైంట్ ఎందుకిస్తారు?
- నా పదవి పోతుందని తప్పుడు ప్రచారమేందుకు?
- నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధి అడ్డుకుంటున్నాడు
- భద్రకాళీ టెంపుల్ మీ సొత్తు కాదు.. రాజేందర్
- చిట్ చాట్ లో మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి కౌంటర్ ఇచ్చారు. చిట్ చాట్‌లో ఆమె మాట్లాడుతూ.. భద్రకాళీ టెంపుల్ ఎవరి సొత్తు కాదన్నారు. అయితే కొందరు తమ సొత్తు అన్నట్లుగా ఫీల్ అవుతున్నారని విమర్శలు చేశారు. నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగమశాస్త్రం ప్రకారమే భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పించాలని నిర్ణయం తీసుకున్నామని, అయితే అక్కడ యాటలు కోస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మవారు శాఖాహారి అని అందరికీ తెలుసని అన్నారు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న పూజార్ల అభిప్రాయం తీసుకున్నామని, బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకువెళ్లి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తామని స్పష్టం చేశారు.

### మంత్రి పదవి పోతుందంటూ..


అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషి అని మంత్రి సురేఖ అన్నారు. నేను మంత్రిగా ఉంటే నా ముందు కూర్చోవడానికి నామోషీగా ఫీల్ అవుతున్నాడని.. అందుకే నా మంత్రి పదవి పోతుందంటూ తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడని మంత్రి సురేఖ మండిపడ్డారు. సీఎం దగ్గరకు, పొంగులేటి వద్దకు వెళ్లి నా మీద ఉన్నది లేనిది చెబుతున్నాడని మంత్రి ఫైర్ అయ్యారు. అదృష్టం ఉంది కాబట్టి నేను మంత్రి అయ్యాను.. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యాడని, అయితే.. నన్నుమంత్రి పదవి దిగిపోవాలని అనుకుంటే ఎలా? నా కూతురికి అదృష్టం లేదు కాబట్టి ఎమ్మెల్యే కాలేదు.. కడియం కూతురికి అదృష్టం ఉంది కాబట్టి ఎంపీ అయ్యింది.. అయితే, నేను ఆమె ఎంపీ పదవి తీయాలని అంటున్నానా? అని మంత్రి సురేఖ ప్రశ్నించారు. ఇక గోదావరి పుష్కరాల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాలను సమానంగా చూడాలన్నారు. పుష్కరాలకు రూ. 200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశామని, గోదావరి పుష్కరాలు ఏపీ కంటే తెలంగాణలోనే ఎక్కువ జరుగుతాయని అన్నారు. భద్రాచల రాముని పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుందని, ఇక్కడే ఘనంగా పుష్కరాలు జరుగుతాయని పేర్కొన్నారు. కేంద్రం తెలంగాణపై వివక్ష చూపడం మంచిది కాదని అన్నారు. గోదావరి పుష్కరాల నిధుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలని.. లేదంటే వారు చేతకాని మంత్రులుగా మిగిలిపోతారని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు.

# ప్రజా సమస్యలపై రెండు పార్టీలు నిర్లక్ష్యం చేశాయి

## పోరాడుతున్న బీజేపీని అడ్డుకుంటున్నాయి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి నాటకాలు ఆడుతున్నాయని.. ప్రజా సంక్షేమంలో దూసుకెళ్తున్న బీజేపీని అడ్డుకునేందుకు ఓ అవగాహనకు వచ్చాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీల నిజ స్వరూపాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల ముందు పెట్టాలన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీయాలని పేర్కొన్నారు. జిల్లాలు, మండలాలతో పాటు గ్రామాల్లో కొత్త కమిటీలను ఏర్పాటు చేసుకున్నామని, కొత్త రక్తంతో ప్రభుత్వంపై పోరుకు సిద్ధం కావాలని కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసు అత్యంత భయంకరమైనదని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. రాజకీయ నాయకులు, హైకోర్టు జడ్జీలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. చివరికి రాష్ట్ర బీజేపీ కార్యాలయ సిబ్బంది, సోషల్ మీడియా టీమ్ మెంబర్స్ ఫోన్లను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించి ఉండేవారన్నారు. ట్యాపింగ్ కేసును బూచిగా చూపి బీఆర్ఎస్ ను తన కనుసన్నల్లో నడిపించుకోవాలన్నది రేవంత్ రెడ్డి వ్యూహమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం అయిదని, ఇప్పటి వరకు గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఒక్క దానిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. పైన బీఆర్ఎస్ ను కాంగ్రెస్ తిట్టడం, లోన ఇరు పార్టీలూ సఖ్యంగా ఉంటూ ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే తమ ప్రభుత్వాన్ని ఎవ్వరూ నమ్మడం లేదంటూ స్టేట్ మెంట్లు ఇస్తున్నారని.. ఈ పరిస్థితులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన పాపాలే కారణమని ధ్వజమెత్తారు.



# గోపన్‌పల్లి భూ వివాదం కేసు

- సీఎం రేవంత్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు
- రేవంత్ రెడ్డిపై 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు

**మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఒక కీలక కేసులో తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 127లో ఉన్న 31 ఎకరాల భూమి హక్కుల విషయమై ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి, రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో పాటు లక్ష్మయ్యలకు మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో 2016లో సొసైటీకి చెందిన స్థలంలోకి కొందరు అక్రమంగా ప్రవేశించారని, అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఇది జరిగిందని సొసైటీ ప్రతినిధి ఎన్. పెద్దిరాజు ఆరోపించారు. తనను అడ్డుకున్నప్పుడు కులం పేరుతో దూషించారని ఆయన గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు రేవంత్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఈ కేసును రద్దు చేయాలని అభ్యర్థిస్తూ రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఘటనా స్థలంలో రేవంత్ రెడ్డి లేరని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అప్పటి ప్రభుత్వం ఈ కేసు బనాయించిందని కోర్టుకు తెలిపారు. మరోవైపు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారుడైన పెద్దిరాజు 2014లోనే చందానగర్‌లో రేవంత్ రెడ్డిపై ఇలాంటిదే ఒక ఫిర్యాదు చేశారని, అయితే సరైన ఆధారాలు లేకపోవడంతో ఆ కేసును కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. అనంతరం 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో పెద్దిరాజు మళ్లీ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో విచారించిన 8 మంది సాక్షుల వాంగ్మూలాల ప్రకారం కూడా రేవంత్ రెడ్డి సంఘటనా స్థలంలో లేరని వారు చెప్పిన విషయాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు పూర్తి కావడంతో, హైకోర్టు ఈ పిటిషన్‌పై తన తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

# లిమిట్స్ దాటొద్దు..

## మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా

- పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ హెచ్చరిక
- కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం
- మంత్రులు శాఖకు పరిమితమైతే మంచిది
- ఉప ఎన్నికపై అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు.

### అంశాలను మీడియాతో మాట్లాడవద్దు..

మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.

# దేశ చరిత్రలోనే అతిపెద్ద ఫోన్ ట్యాప్ ఇదే

## అంతా కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగింది

- చివరకు కవిత ఫోన్ కూడా ట్యాప్ చేయించారు
- గోనె ప్రకాశ్ రావు సంచలన వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు హాజరైన కాంగ్రెస్ నేత



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సీనియర్ నేత, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు తన స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రకాశ్ రావు.. దేశ చరిత్రలోనే అతిపెద్ద ఫోన్ ట్యాపింగ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిందని ఆరోపించారు. హుజురాబాద్ ఉప ఎన్నిక నుంచి నా ఫోన్ ట్యాప్ చేశారని..మునుగోడు ఉప ఎన్నికలోనూ విచ్చలవిడిగా ట్యాప్ చేశారన్నారు. నా ప్రైవసీకి ఎలా భంగం కలిగిస్తారని ప్రశ్నించారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, చివరకు కల్వకుంట్ల కవిత ఫోన్ కూడా కేటీఆర్, సంతోష్ రావులు ట్యాపింగ్ చేయించారని ప్రకాశ్ రావు తెలిపారు. కేసీఆర్ ఆదేశాలతోనే వాళ్లు కవిత ఫోన్ ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారికి ప్రమోషన్లు ఇచ్చారని గోనె ప్రకాశ్ రావు వెల్లడించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ట్యాపింగ్ చేశారని, ఆగస్టు 5తర్వాతైనా ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును అరెస్టు చేసి కస్టోడియల్ విచారణ చేస్తారన్నారు. అన్ని వేళ్లు ఈ కేసులో కేసీఆర్ ను సూత్రధారిగా చూపుతున్నాయని..ఆయన తప్పించుకోలేరని ప్రకాశ్ రావు అన్నారు.

**ఓటుకు నోటు అంశం కూడా..**

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో పైలట్ రోహిత్ రెడ్డి, నందకుమార్ ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసును బీజేపీ సీబీఐతో ఎంక్వయిరీ జరిపించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. గతంలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు అంశం కూడా ఈ ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వెలుగులోకి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, సొంత పార్టీ నేతలైన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు వంటి వారి ఫోన్లను కూడా అప్పటి ప్రభుత్వం ట్యాప్ చేసిందని పేర్కొన్నారు. ఎలాగైనా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ విజయం సాధించాలనే లక్ష్యంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం విచక్షణారహితంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆయన మండిపడ్డారు.

# ఏపీతో వివాదం కోరుకోవడం లేదు

(మొదటిపేజీ తరువాయి)



ఏపీ విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఢిల్లీలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఎవరితోనూ తాము వివాదం కోరుకోవడం లేదని, ఎవరికోసమో తెలంగాణ హక్కులు వదులుకోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. కృష్ణాజల్లాలో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌ఓసీకి తాను అడిగినందుకు మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుపడుతున్నారని ఆయన వాదనలో పసలేదని చెప్పారు. 2023లో కేంద్రానికి హరీష్‌రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. తెలంగాణలో తమ ప్రాజెక్ట్‌లు పూర్తయి, పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకున్న తర్వాతే ఆంధ్రప్రదేశ్ వారి ప్రాజెక్ట్‌ల గురించి ఆలోచించాలని కోరారు. నీళ్లు, నిధుల పేరిట మోసపూరిత సెంటిమెంట్‌ని గతంలో బీఆర్ఎస్ నేతలు అడ్డుపెట్టుకున్నారని.. ఇప్పుడు జలాలను సంజీవని అని భావిస్తున్నారని సీఎం అన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని మండిపడ్డారు. గతంలో ఏపీకి అన్ని హక్కులు రాసిచ్చారని ఆరోపించారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని, మరీ ఇప్పుడు గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 50 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందించారని చెప్పారు. ఈ ఏడాదిలో తెలంగాణలో పండిన అత్యధిక పంటలకు కాళేశ్వరం నీళ్లకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీష్‌రావులే అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కూర్చుని మాట్లాడుకుంటే వివాదం ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీఎఫ్ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైందని, ఏపీ పీఎఫ్ఆర్ ఇచ్చిన వెంటనే కేంద్రం కూడా స్పందిస్తోందన్నారు. బనకచర్లపై కేంద్రం అన్ని రకాలు చర్యలకు సిద్ధమైందన్నారు. పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే తెలంగాణతో ఏపీ చర్చించి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు.

### కిషన్ రెడ్డికి కేటీఆర్ ప్రైవేట్ ట్యూషన్ మాస్టర్

కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. కేటీఆర్ కు కిషన్ రెడ్డి లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఆర్గాన్ డొనేషన్ చేసింది కాబట్టే.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 ఎంపీ స్థానాలు గెలిచిందన్నారు. కిషన్ రెడ్డికి కేటీఆర్ ప్రైవేట్ ట్యూషన్ మాస్టర్‌గా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కోసం బీజేపీ, బీజేపీ కోసం బీఆర్ఎస్ పనిచేస్తున్నాయని.. ఇప్పుడు ఇద్దరి బంధం చాలా స్ట్రాంగ్‌గా ఉందని తీవ్ర విమర్శలు చేశారు.

ANN తెలుగు
మహా పత్రిక
03
శనివారం, హైదరాబాద్ | 21-06-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

### నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు

### అమెరికా పర్యటన కంటే ఒడిశాకే తన ప్రాధాన్యత అన్న ప్రధాని మోదీ



**ఒడిశా, మహా :** అమెరికా పర్యటనకు రావాలంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని, ఒడిశా పర్యటనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒడిశాలో పర్యటించిన ఆయన, జగన్నాథుని భూమికి రావడం తనకెంతో ముఖ్యమని పేర్కొన్నారు. అంతకుముందు బీహార్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మోదీ, మధ్యాహ్నం ఒడిశా చేరుకుని రోడ్ షో, బహిరంగ సభలో పాల్గొన్నారు. జీ 7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి, వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారని, విందులో పాల్గొని చర్చించుకుందామని చెప్పారని అన్నారు. "జగన్నాథుని క్షేత్రానికి వచ్చేందుకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని నేను వినమ్రంగా తిరస్కరించాను" అని మోదీ బహిరంగ సభలో వెల్లడించారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ తొలి ఏడాది పాలనను ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. "ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది. పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలను, రత్న భండార్‌ను తిరిగి తెరిపించింది" అని ఆయన అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ రూ.18,600 కోట్లకు పైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఒడిశా విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించడంతో పాటు, పలు కొత్త రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అంతేకాకుండా, 'లక్షపతి దీదీలు' సహా పలువురు లబ్ధిదారులను సత్కరించారు. తాగునీరు, నీటిపారుదల, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, గ్రామీణ రహదారులు, వంతెనలు, జాతీయ రహదారులు, రైల్వే మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. గత ఏడాది జూన్ ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని మోదీ రాష్ట్రానికి రావడం ఇది ఆరోసారి.

# ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు

### పేద పిల్లలు నేర్చుకోకుండా బీజేపీ కుట్ర

- ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గం
- అమిత్ షా వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ కౌంటర్



**ఢిల్లీ, మహా:** ఇంగ్లీష్ భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. ఇంగ్లీష్ సిగ్గుపడే భాష కాదు అని, అది సాధికారతను కల్పించే భాష అన్నారు. ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పించాలని రాహుల్ అభిప్రాయపడ్డారు. కానీ బీజేపీ ఆర్ఎస్ఎస్ ఆ భాషను పేద పిల్లలు నేర్చుకోకుండా చేస్తోందని, ఎందుకంటే ప్రశ్నించడం వాళ్లకు ఇష్టం ఉండదని, సమానత్వాన్ని వాళ్లు కోరుకోవడం లేదని రాహుల్ అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ శుక్రవారం ఓ పోస్టు చేశారు. ఇంగ్లీష్ భాష ఆనకట్ట కాదు అని, అదో వారధి అన్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం సిగ్గుచేటు కాదు అని, అది సాధికారత ఇస్తుందన్నారు. ఇంగ్లీష్ గొలుసు కాదు అని, అది గొలుసుల్ని బ్రేక్ చేసే పరికరం అన్నారు. భారత దేశ పేద ప్రజలు ఇంగ్లీష్ నేర్చుకోవద్దన్న ఆలోచనలో బీజేపీఆర్ఎస్ఎస్ ఉన్నట్లు రాహుల్ ఆరోపించారు. మాతృభాష తరహాలోనే ఇంగ్లీష్ భాష ముఖ్యమైందని, ఎందుకంటే అది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందన్నారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

# ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్లు విడుదల

### 7 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ

### ఇప్పటి వరకు 65.12 లక్షల మంది రైతులకు లబ్ధి




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో రైతు భరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధుల జమ కొనసాగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ఐదో రోజు శుక్రవారం 7 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. అందుకోసం ప్రభుత్వం మరో రూ.905.89 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేవలం ఐదు రోజుల్లో రూ.7,310.59 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. ఇప్పటి వరకు 65.12లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందిందన్నారు. విస్తీర్ణంతో సంబంధం లేకుండా సాగుభూమికి సాయం అందజేస్తామని స్పష్టం చేశారు.

# 24న కాంగ్రెస్ నూతన కమిటీల సమావేశం

### పీసీసీ చీఫ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో..

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో భేటీ
- పాల్గొననున్న మీనాక్షి, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు



**హైదరాబాద్, మహా:** ఈ నెల 24న ఉదయం 11 గంటలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీ భవన్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాల (పొలిటికల్ అఫైర్స్ కమిటీ పీఏసీ) కమిటీ సమావేశం కానుంది. అనంతరం పీసీసీ సలహా కమిటీ (పీసీసీ అడ్వైజరీ కమిటీ పీఏసీ) సమావేశాలు జరగనున్నాయి. అనంతరం మధ్యాహ్నం తర్వాత నూతనంగా నియామకం అయిన టీపీసీసీ ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పాల్గొంటారు.

**పదవుల భర్తీ..**

రాష్ట్రంలో మొత్తం 27 మంది రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులను, 69 మంది ప్రధాన కార్యదర్శులను ఏఐసీసీ వెల్లడించింది. పీసీసీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను మాత్రం ఇంకా ప్రకటించలేదు. పదవుల భర్తీలో విధేయత, సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది కాంగ్రెస్ అధిష్టానం. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తున్న వారి వివరాలను జిల్లాల వారీగా సేకరించి ఈ పదవులకు ఏఐసీసీ ఎంపిక చేసింది.


# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

## రూ.14 వేల కోట్లతో పనులు

### కొత్త టెర్మినల్, అదనపు రన్ వేల నిర్మాణం

### 2026లో మొదలు పెట్టి 2029లో పూర్తి చేయాలని లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



2008లో ప్రారంభమైన శంషాబాద్ విమానాశ్రయం అతి తక్కువ కాలంలోనే భారతదేశంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో ఒకటిగా మారింది. దీని ప్రస్తుత సామర్థ్యం పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు సరిపోవడం లేదు. హైదరాబాద్, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ కేంద్రంగా మారడంతో.. అంతర్జాతీయ, దేశీయ ప్రయాణాల డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని సిద్ధం చేయడానికి విస్తరణ అవసరమని గుర్తించింది. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఒక కొత్త టెర్మినల్, విమానాల రాకపోకలను సులభతరం చేయడానికి ఒక అదనపు రన్‌వేను నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నూతన మౌలిక సదుపాయాలు విమానాశ్రయం కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. వచ్చే ఏడాది (2026) ప్రారంభంలోనే విస్తరణ పనులను మొదలు పెట్టి.. 2029 నాటికి వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కాలపరిమితిలో.. పనులు వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయనుంది.

రూ.14,000 కోట్ల భారీ పెట్టుబడి కేవలం మౌలిక సదుపాయాల పెంపుదలకు మాత్రమే పరిమితం కాదు.. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై బహుముఖ సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. విమానాశ్రయం విస్తరణ పనుల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, ఇతర అనుబంధ పరిశ్రమలకు ఇది ఊతమిస్తుంది. అంతేకాకుండా మెరుగైన వాయు కనెక్టివిటీ పర్యాటక రంగానికి, వాణిజ్య కార్యకలాపాలకు, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి దోహదపడుతుంది. ఈ విస్తరణ ప్రాజెక్టులో సుస్థిరత అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, స్మార్ట్ ఎయిర్‌పోర్ట్ ఫీచర్లను ఉపయోగించి భవిష్యత్ అవసరాలకు ధీటుగా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని జీఎంఆర్ భావిస్తోంది. రానున్న పదేళ్లలో హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తుల్లో ఒకటిగా మారాలనే లక్ష్యంతో ఈ విమానాశ్రయం విస్తరణ ఒక కీలకమైన సాధనంగా నిలుస్తుంది. ఇది హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో మరింత ప్రముఖంగా నిలుపుతుంది.

# త్వరలోనే కొత్త ట్రాఫిక్ రూల్స్

### హైదరాబాద్‌లో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

### సీఎస్ఆర్ భాగస్వామ్యాన్ని పెంచుతాం: హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, మహా :** సురక్షితమైన, సులభమైన ప్రయాణానికి వీలుగా నూతన ట్రాఫిక్ నియంత్రణ విధానాలు అమలులోకి రానున్నాయని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన సీపీ నగర రహదారులపై వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, సగటు వేగం గంటకు 24 నుంచి 26 కిలోమీటర్లకు చేరిందని ఆయన పేర్కొన్నారు. సుమారు 90 లక్షలకు పైగా వాహనాలు రోజూ తిరుగుతున్నప్పటికీ.. రహదారుల విస్తీర్ణం మాత్రం పరిమితంగానే ఉందని.. ఈ పరిస్థితుల్లో పటిష్టమైన ట్రాఫిక్ నిర్వహణ అత్యవసరమని ఆయన వివరించారు. ట్రాఫిక్ నియంత్రణకు అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడానికి పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో గూగుల్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించారు. గూగుల్ మ్యాప్స్ డేటా అనలిటిక్స్ వ్యవస్థలను ఉపయోగించుకొని ఇప్పటికే రూ.100 కోట్ల వ్యయంతో ఎల్ అండ్ టి ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తామని సీపీ తెలిపారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్లను ఉపయోగించి పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, వ్యూహాత్మక ప్రాంతాల్లో ఎత్తైన భవనాలపై హైరైజ్ కెమెరాలు (బర్డ్స్ ఐ వ్యూ) 25 చోట్ల ఏర్పాటు చేశామని.. భవిష్యత్తులో వీటి సంఖ్యను పెంచుతామని వివరించారు. ఈ వినూత్న ఆలోచన నగర ట్రాఫిక్ పై సమగ్ర పర్యవేక్షణకు దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం నగరంలోని 85 శాతం ట్రాఫిక్ సిగ్నల్స్ ఆటో మోడ్‌లో పనిచేస్తున్నాయని.. దీనిని 90 శాతానికి పెంచే లక్ష్యంతో ఉన్నామని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించి, వాహనాల సగటు వేగాన్ని మరింత పెంచుతుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం తన పర్యటనల కోసం ట్రాఫిక్‌ను ఎక్కువసేపు నిలిపివేయవద్దని.. ఎదుటి మార్గంలో వాహనాలను వదిలిపెట్టాలని సూచించారని.. ఇది పౌరుల సౌకర్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తుందని ఆయన అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై నమోదు చేసే కేసుల సంఖ్యపై కాకుండా.. ఉల్లంఘనల నాణ్యతపై, వాహనదారులలో క్రమశిక్షణ మార్పు తీసుకురావడంపై దృష్టి పెడతామన్నారు. నగరంలో ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు చేపట్టిన 'ఆపరేషన్ రోప్'ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్తామని సీపీ ప్రకటించారు. ఫుట్‌పాత్‌లు, తోపుడు బండ్ల ఆక్రమణలను తొలగించడం వల్ల రహదారులపై వేగం పెరిగిందని.. ఇది సానుకూల పరిణామమని ఆయన అన్నారు. అయితే.. సిబ్బంది కొరతను అధిగమించడానికి, ట్రాఫిక్ నిర్వహణలో పౌర భాగస్వామ్యాన్ని పెంచడానికి ఒక వినూత్న పథకాన్ని అమలు చేయనున్నారు.

**హైదరాబాద్‌లో మల్టీ లెవల్ కార్ పార్కింగ్.. ఒకేసారి 72 కార్లు..!**

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) లో భాగంగా 'ట్రాఫిక్ మార్షల్' పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. పెద్ద వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు తమ పరిసరాల్లోని ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతను తీసుకోవాలని, ఇందుకోసం తమ సొంత సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఈ సిబ్బందికి పోలీసులు ప్రత్యేక శిక్షణ ఇస్తారని, తద్వారా వారు సమర్థవంతంగా ట్రాఫిక్‌ను నియంత్రించగలరని తెలిపారు. రాత్రిపూట ట్రావెల్స్ బస్సుల వల్ల జరుగుతున్న ఇబ్బందులపై కూడా చర్చించి పరిష్కారం కనుగొంటామని సీపీ హామీ ఇచ్చారు. ఈ సమగ్ర ప్రణాళికలు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా తీర్చిదిద్దడానికి దోహదపడతాయని భావిస్తున్నారు.

# బనకచర్ల ప్రాజెక్టు ఆపేయాలి

- పోలవరం కడుతున్నా కొత్త ప్రాజెక్టులు ఎందుకు?
- నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు అవసరం లేదు
- ఏపీ సర్కార్‌పై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ఫైర్



**హైదరాబాద్, మహా:** తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారని, బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

### రూ.10వేల కోట్ల నష్టం..

3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుందన్నారు. 'వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి. పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలి. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకు? తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి'అని ఎమ్మెల్యే కూనంనేని కోరారు.

# ఈఎన్‌సీ అనిల్‌కు షాక్!

### మేడిగడ్డ ఎఫెక్ట్ తో బదిలీ వేటు

### పోస్టింగ్ లేకుండా రిపోర్ట్ చేయాలని ఆదేశం

### గ్రౌటింగ్ అంశంలో ప్రభుత్వ ఆగ్రహమే కారణం

### ఈఈ శ్రీధర్ విషయంలో కలగజేసుకున్నారని ఆరోపణలు



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర నీటిపారుదల రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి.అనిల్ కుమార్‌పై బదిలీ వేటు పడింది. ఆయనకు తదుపరి పోస్టింగ్ ఎక్కడా కేటాయించకుండా, తక్షణమే ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆకస్మిక బదిలీ వెనుక మేడిగడ్డ ఆనకట్ట గ్రౌటింగ్‌కు సంబంధించిన వివాదమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గ్రౌటింగ్ చేయడంతో బ్యారేజీకి సంబంధించిన అన్ని పరీక్షలు చేయడానికి ఆస్కారం లేకుండా పోయిందని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తుది నివేదికలో పేర్కొంది. ఎవరి ఆదేశాల మేరకు గ్రౌటింగ్ చేశారని అనిల్ కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.

**మేడిగడ్డ బ్యారేజీ గ్రౌటింగ్ అంశంలో..**

మేడిగడ్డ బ్యారేజీకి గ్రౌటింగ్ పనులు చేపట్టడం వల్ల, నిర్మాణానికి సంబంధించిన సమగ్రమైన పరీక్షలు నిర్వహించేందుకు వీలు లేకుండా పోయిందని జాతీయ ఆనకట్టల భద్రతా అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తన తుది నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అంశం ముఖ్యమంత్రి, మంత్రుల స్థాయి సమావేశంలో కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరో వివాదం కూడా అనిల్ కుమార్ బదిలీకి కారణంగా చెబుతున్నారు. ఈఈ నూనె శ్రీధర్‌ను బదిలీ చేసినప్పటికీ, ఆయన పాత స్థానంలోనే కొనసాగేందుకు అనిల్ కుమార్ సహకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాలన్నింటినీ తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం, ఈఎన్సీ జనరల్ హోదాలో ఉన్న అనిల్ కుమార్‌ను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. అనిల్ కుమార్ స్థానంలో, చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న అంజద్ హుస్సేన్‌కు ఈఎన్సీ జనరల్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు. అంజద్ హుస్సేన్ ఇప్పటికే ఈఎన్సీ (అడ్మిన్)గా కూడా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# లాభం ఆంధ్రాకు.. నష్టం తెలంగాణకు

### 7 మండలాలు ఏపీకి అన్యాయంగా ఇచ్చారు

- పోలవరం ముంపు గ్రామాలు తెలంగాణకు తిరిగివ్వాలి
- దీనిపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** పోలవరం ప్రాజెక్టు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని సూచించారు. పోలవరం ముంపుపై, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఏపీలో కలిపిన గ్రామాల్లోని పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని తెలిపారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు.

### పోలవరం ప్రాజెక్టును ఆపే..

ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాముడి భూమి వెయ్యి ఎకరాలు ఉందని, వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయింది... దేవుడేమో తెలంగాణలో ఉన్నాడు అని తెలిపారు. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో లో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి అన్యాయం చేశారని విమర్శించారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని ఆరోపించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తాము గళమెత్తామని, బీఆర్ఎస్ పార్టీ సభ్యులం పార్లమెంటులో మాట్లాడాము కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఆ నాడు కూడా పట్టనట్టు వ్యవహరించారని తెలియజేశారు.

# ఒంటికి యోగా.. మంచిదేగా







## నేడే.. యోగా డే

(మహా ప్రత్యేకం)

యోగా అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక అభ్యాసాల కలయిక. ఇది శరీరానికి, మనసుకు మరియు ఆత్మకు మధ్య సామరస్యాన్ని సాధించడానికి సహాయపడుతుంది. యోగ దృష్టికి సకల చరాచరాల్లో ఏకత్వం కనిపిస్తుంది. భూత భవిష్యత్ వర్తమానాలు కరతలామలకం అవుతాయి. మోక్ష సాధనకు యోగ మార్గమే శరణ్యమని గీత చెబుతున్నది. యోగా అనేది శారీరక ఆసనాల సాధన కంటే చాలా ఎక్కువ. యోగాను క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల మనం మానసికంగా ఎదగడానికి సహాయపడుతుంది; మన కోరికలను నియంత్రించుకోవడం నేర్చుకుంటాము, తద్వారా అవి మనపై పట్టును ఆపుతాయి.

**హైదరాబాద్ లో యోగా శోభ**

హైదరాబాద్ నగరంలోని ఎల్బీ స్టేడియం శుక్రవారం ఉదయం యోగా శోభతో నిండిపోయింది. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేవలం ఒక రోజు ముందుగా, ఈ కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ప్రజలలో యోగా పట్ల అవగాహన పెంచడం, దాని ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి నేతృత్వం వహించారు. ఆయనతో పాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, భారతీయ జనతా పార్టీ నాయకురాలు, నటి ఖుష్బూ సుందర్ తదితరులు హాజరై యోగాసనాలు వేశారు. వీరితో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువ నటులు సాయి దుర్గాతేజ్, తేజా సజ్జ, నటి మీనాక్షి చౌదరి వంటి వారు ఉత్సాహంగా యోగాసనాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో నగరవాసులు తరలివచ్చి, ప్రముఖులతో కలిసి యోగా సాధన చేశారు. ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో దానికి గుర్తుగా ఈ కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచానికి సంజీవని లాంటి యోగాను అందించిన భారత్

(జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం)

ఐక్యరాజ్య సమితి వేదికగా 27 సెప్టెంబర్ 2014న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంతర్జాతీయ యోగా దినోత్సవంకి పిలుపు ఇచ్చారు.11 డిసెంబర్ 2014 నాడు ఐక్యరాజ్యసమితి యొక్క సభ్య దేశాలు ఏకగ్రీవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరుపుకునేందుకు ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించాయి.

**జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఏంటంటే..**

జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఈ రోజుకు ఆయా ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి భారత ప్రధాని మోదీ సూచించారు.

2015 జూన్ 21వ తేదీ నుంచి ప్రతీ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి యొక్క అన్ని సభ్య దేశాలు నిర్వహిస్తున్నాయి.

**పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా**

ప్రపంచ మానవాళి పరిపూర్ణ ఆరోగ్యానికి యోగాభ్యాసము ఉపయోగపడుతుందని మరొక తీర్మానాన్ని కూడా ఆమోదించాయి. తీర్మానం విలువ ఏమిటో కరోనా వంటి విపత్కర పరిస్థితులలో ప్రపంచానికి అనుభవానికి వచ్చింది. ప్రస్తుతము యోగా దినోత్సవాన్ని 190 సభ్య దేశాలలో జరుపు కుంటున్నాము.

**యోగాకు జన్మభూమి భారత్**

మన దేశంలో జన్మించి దశదిశలా వ్యాపించింది యోగా.వేదకాలం నుంచే భారత్‌లో యోగా ఉంది. జీవనశైలిలో ఎన్ని హైటెక్ వసతులు భాగమైనా మానసిక కుంగుబాటుకు యోగా సాధనే సమాధానం. అందుకే 2015లో జూన్ 21ని అంతర్జాతీయ యోగాదినోత్సవంగా ఐరాస ప్రకటించింది. దీన్ని మన దేశమే బ్రాండింగ్ చేయడం యోగా డే ప్రత్యేకత.

**సహజ రోగనిరోధక శక్తిని కలిగించేది యోగా**

శరీరంలో రోగనిరోధక శక్తిని సహజంగా పెంచే విధానాల్లో యోగా ఒకటి. వేదకాలం నుంచి ఆదికాలం వరకూ సనాతన భారత సంప్రదాయంలోనే ఇమిడి ఉంది.పూర్వీకులు శారీరక, మానసికోల్లాసానికి యోగా ఆచరించారు. ప్రాచీనకాలంలో ఎందరో మునులు, యతులు, రుషులు, యోగులు తమ తపోనిష్టకు అనారోగ్యం అడ్డు కాకుండా కనిపెట్టిన ఆసనాలు, ఆచరించిన శ్వాస సంబంధిత ప్రాణాయామాలు ఇప్పుడు 'యోగా' పాఠాలుగా మారాయి. పతంజలిని యోగ పితామహుడిగా అభివర్ణిస్తారు .మానసిక సమస్యలకు పరిష్కారం, శారీరక రుగ్మతలకు సమాధానం, అధ్యాత్మికానుభూతికి ఆలవాలం యోగానే. జీవనశైలిలో ఎన్ని హైటెక్ వసతులు, పోకడలు భాగమైనా ప్రాచీన యోగా పద్ధతులతోనే ఫలితాలు సాధిస్తున్నారు చాలా మంది.

**మేధాశక్తి, ఆత్మశక్తిల కలయిక యోగా**

మేధాశక్తి , ఆత్మశక్తి కలయికయోగా అంటే శారీరక వ్యాయామమనే భావన చాలామందిలో ఇప్పటికీ ఉంది. వాస్తవానికి మేధాశక్తి , ఆత్మశక్తి కలయికగా యోగాను అభివర్ణిస్తారు.రోజువారీ క్రమపద్ధతిలో యోగా సాధన వల్ల శరీరాన్ని, మనసునూ ఉన్నత స్థితికి చేర్చుకోవచ్చని శిక్షకులు చెబుతున్నారు. అంతర్లీనంగా ఉండే శక్తిని సమతుల్య పద్ధతిలో అభివృద్ధి చేసుకునేందుకు యోగా ఒక క్రమశిక్షణలా పని చేస్తుందంటున్నారు.ఎన్నో మార్పులుగత శతాబ్దంలో యోగాలో విభిన్న ఆసనాలు ఆచరణలోకి వచ్చాయి.

**పల్లెపల్లెకూ యోగ**

చాలా దేశాల్లో నగరాలు, పట్టణాల నుంచి పల్లెల వరకూ యోగా శిక్షణాలయాలు వెలిశాయి. మన దేశంలోనూ స్థానికంగానే కాకుండా ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన యోగా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. చికిత్స దృక్పథంతో యోగాను జీవన విధానంగా సాధన చేస్తున్న వారూ లేకపోలేదు. మంత్రం, ముద్రలు, ఆసనం, ప్రాణాయామం, యోగానిద్ర, హఠయోగ క్రియలు వంటి ఆసనాల్లో తర్ఫీదు పొందుతున్నారు. విశ్వవ్యాప్తంగా ఎందరో యోగా సాధకులుగా, గురువులుగా కొనసాగుతున్నారు.

**ప్రపంచానికి సంజీవని లాంటి యోగాను అందించిన భారత్**

ప్రపంచానికి మనదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటని నిస్సందేహంగా చెప్పొచ్చు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది యోగా సాధనకు పూనుకుంటున్నారు.సంపూర్ణమైన ఆరోగ్యకరమైన జీవన విధానానికి సంజీవనిలాగా యోగాపనిచేస్తుంది. ఆధునిక ప్రపంచానికి యోగాను అనుగ్రహించిన భారత్ మరోసారి తన జగద్గురు స్థానాన్ని నిరూపించుకున్నది.

**యోగాతో రోగాలకు చెక్**

కరోనావంటి విపత్కర పరిస్థితుల్లో యోగ ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని చాలా మంది రోగనిరోధక శక్తిని పెంచుకున్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలి. అప్పుడే ఆరోగ్య భారత్ నిర్మితమవుతుంది.



పిన్నింటి బాలాజీ రావు
హనుమకొండ, 9866776286

# యోగా మన జీవన విధానం

ప్రతి సంవత్సరం జూన్ 21వ తేదీన జరుపుకునే అంతర్జాతీయ యోగ డే, శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును ప్రోత్సహించే భారతీయ సంప్రదాయ యోగాన్ని సమీకరించే ప్రపంచ ఉత్సవం. 2014లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో భారత ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదన మేరకు, 2015 నుండి ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా జరుపబడుతోంది. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, ఇది శరీరం, మనస్సు మరియు ఆత్మను సమన్వయం చేసే ఒక సమగ్ర జీవన విధానం.

**యోగా – పుట్టుక, చరిత్ర మరియు అభివృద్ధి**

యోగా యొక్క మూలాలు భారతదేశంలో 5,000 సంవత్సరాల క్రితం సింధుసరస్వతీ నాగరికతలో ఉన్నాయి. యోగా గురించి మొట్టమొదటి ఆధారాలు ఋగ్వేదంలో మరియు ఉపనిషత్తులలో కనిపిస్తాయి. యోగా యొక్క సమగ్ర విధానాన్ని సమగ్రంగా వివరించిన పతంజలి రచించిన యోగ సూత్రాలు (క్రీ.పూ. 200) యోగా యొక్క పునాదిగా పరిగణించబడుతుంది. ఈ గ్రంథంలో, యోగాన్ని "చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించారు, అంటే మనస్సు యొక్క అలజడులను నియంత్రించడం. భగవద్గీతలో కూడా కర్మ యోగ, జ్ఞాన యోగ, భక్తి యోగ వంటి వివిధ యోగ మార్గాల గురించి ప్రస్తావించబడింది.

పురాతన కాలంలో, యోగా ఆధ్యాత్మిక సాధనగా పరిగణించబడినప్పటికీ, హఠ యోగ, రాజ యోగ, కుండలినీ యోగ వంటి విభిన్న శాఖలు కాలక్రమేణా అభివృద్ధి చెందాయి. ఈ శాఖలు శారీరక ఆసనాలు, శ్వాసక్రియలు, ధ్యానం మరియు ఆధ్యాత్మిక అభ్యాసాలను కలిపి ఒక సమగ్ర విధానాన్ని అందించాయి.

**యోగ సూత్రాలు: యోగ శాస్త్రానికి పునాది**

పతంజలి మహర్షి రచించిన యోగ సూత్రాలు యోగ శాస్త్రానికి ప్రామాణిక గ్రంథంగా పరిగణించబడుతుంది. ఈ గ్రంథం 195 సూత్రాలను కలిగి ఉంది, ఇవి నాలుగు అధ్యాయాలుగా (పాదాలుగా) విభజించబడ్డాయి: సమాధి పాద, సాధన పాద, విభూతి పాద, మరియు కైవల్య పాద. ఈ సూత్రాలు యోగ సాధన యొక్క సిద్ధాంతం, అభ్యాసం, మరియు లక్ష్యాలను స్పష్టంగా వివరిస్తాయి.

**యోగ నిర్వచనం**

పతంజలి యోగ సూత్రాలులో యోగాన్ని "చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించారు, అంటే మనస్సు యొక్క అలజడులను (వృత్తులను) నియంత్రించడం. ఈ నిర్వచనం యోగాన్ని కేవలం శారీరక ఆసనాలకు పరిమితం చేయకుండా, మానసిక శాంతి మరియు ఆధ్యాత్మిక ఆవిష్కరణకు మార్గంగా హైలైట్ చేస్తుంది.

**అష్టాంగ యోగ: యోగ మార్గం**

పతంజలి తన యోగ సూత్రాలులో అష్టాంగ యోగను ప్రవేశపెట్టారు, ఇది యోగ సాధనకు ఎనిమిది దశలను కలిగి ఉంది. ఈ ఎనిమిది దశలు మనస్సు, శరీరం, మరియు ఆత్మను సమతుల్యం చేసే సమగ్ర విధానాన్ని అందిస్తాయి:

**యమ:** సామాజిక నీతి నియమాలు (అహింస, సత్యం, అస్తేయ, బ్రహ్మచర్య, అపరిగ్రహ).

**నియమ:** వ్యక్తిగత క్రమశిక్షణ (శౌచ, సంతోష, తపస్సు, స్వాధ్యాయ, ఈశ్వర ప్రణిధాన).

**ఆసన:** శారీరక భంగిమలు, శరీర దృఢత్వం మరియు సౌలభ్యం కోసం.

**ప్రాణాయామ:** శ్వాస నియంత్రణ, శక్తిని సమతుల్యం చేయడానికి.

**ప్రత్యాహార:** ఇంద్రియ నిగ్రహం, బాహ్య ప్రపంచం నుండి మనస్సును విడదీయడం.

**ధారణ:** ఏకాగ్రత, మనస్సును ఒకే బిందువుపై కేంద్రీకరించడం.

**ధ్యాన:** ధ్యానం, నిరంతర ఏకాగ్రత ద్వారా మానసిక శాంతి.

**సమాధి:** ఆధ్యాత్మిక ఆనందం మరియు స్వీయ ఆవిష్కరణ యొక్క అత్యున్నత స్థితి. ఈ అష్టాంగ యోగ విధానం యోగాన్ని కేవలం శారీరక వ్యాయామంగా కాకుండా, జీవన విధానంగా స్థాపించింది. ఇది ఆధునిక యోగా సాధనలకు (హఠ యోగ, రాజ యోగ) ఆధారంగా నిలిచింది.



**మానసిక శాంతి మరియు ఆధ్యాత్మిక లక్ష్యం**

పతంజలి యోగాన్ని మానసిక అలజడులను నియంత్రించే సాధనంగా చిత్రీకరించారు. ఆయన సూత్రాలు మనస్సు యొక్క స్వభావాన్ని, దాని బాధలను (క్లేశాలు: అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, అభినివేశ) మరియు వాటిని అధిగమించే మార్గాలను వివరిస్తాయి. యోగ సాధన ద్వారా సాధకుడు కైవల్యం (మోక్షం లేదా ఆధ్యాత్మిక విముక్తి) సాధించవచ్చని పతంజలి నొక్కి చెప్పారు.

**శాస్త్రీయ విధానం**

పతంజలి యోగాన్ని ఒక శాస్త్రీయ విధానంగా సమర్పించారు. ఆయన సూత్రాలు క్రమబద్ధమైనవి మరియు తర్కబద్ధమైనవి, ఇవి ఆధ్యాత్మిక లక్ష్యాలను సాధించడంతో పాటు, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఆయన రచనలు యోగ సాధనను సరళంగా మరియు అందరికీ అర్థమయ్యేలా చేశాయి

**యోగా యొక్క ప్రాముఖ్యత**

యోగా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. ఆసనాలు, ధ్యానం మరియు శ్వాసక్రియ వంటి యోగా అభ్యాసాలు శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం మరియు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తాయి. ఆధునిక జీవనశైలిలో పెరిగిపోతున్న ఒత్తిడి, ఆందోళన మరియు ఆరోగ్య సమస్యల నేపథ్యంలో, యోగా ఒక సమర్థవంతమైన పరిష్కారంగా ఉద్భవించింది.

**యోగా ద్వారా లభించే ప్రయోజనాలు**

యోగా యొక్క ప్రయోజనాలు శాస్త్రీయంగా ధృవీకరించబడ్డాయి మరియు ఇవి శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక రంగాలలో విస్తరించి ఉన్నాయి:

**శారీరక ఆరోగ్యం:**

యోగా ఆసనాలు కండరాల బలాన్ని, సౌలభ్యాన్ని మరియు సమతుల్యతను మెరుగుపరుస్తాయి. రక్తపోటు, గుండె జబ్బులు, డయాబెటిస్ మరియు ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో యోగా సహాయపడుతుంది.

**మానసిక శాంతి:**

ధ్యానం మరియు ప్రాణాయామం (శ్వాసక్రియ) ఒత్తిడి హార్మోన్లను తగ్గించి, ఆందోళన మరియు డిప్రెషన్‌ను నియంత్రిస్తాయి. ఇవి ఏకాగ్రతను మరియు మానసిక స్పష్టతను పెంచుతాయి.

**రోగనిరోధక శక్తి:**

యోగా శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది, ఇది వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**ఆధ్యాత్మిక శ్రేయస్సు:**

యోగా ఆత్మ ఆవిష్కరణకు మరియు అంతర్గత శాంతికి మార్గం సుగమం చేస్తుంది, జీవితంలో ఒక లోతైన ఉద్దేశ్యాన్ని అందిస్తుంది.

**జీవనశైలి మెరుగుదల:**

యోగా ఆహార అలవాట్లు, నిద్ర నాణ్యత మరియు రోజువారీ జీవనంలో క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది.

**అంతర్జాతీయ యోగ డే యొక్క ఉద్దేశ్యం**

అంతర్జాతీయ యోగ డే యొక్క ప్రధాన లక్ష్యం యోగా యొక్క ప్రయోజనాల గురించి ప్రపంచవ్యాప్త అవగాహన కల్పించడం. ఈ రోజు ద్వారా, వివిధ సంస్కృతులు మరియు దేశాలలోని ప్రజలు యోగాను అనుసరించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించేలా ప్రోత్సహించబడుతున్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరత మరియు సామరస్యం కోసం యోగా ఒక సాధనంగా పనిచేస్తుందని ఈ రోజు సందేశం ఇస్తుంది. 2025 థీమ్ "సామరస్యం కోసం యోగా" అని నిర్ణయించబడింది, ఇది వ్యక్తులు మరియు సమాజాల మధ్య ఐక్యతను ప్రోత్సహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజు సామూహిక యోగా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు మరియు ఆన్‌లైన్ సెషన్‌ల ద్వారా జరుపబడుతుంది. భారతదేశంలో, పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు మరియు ప్రభుత్వ సంస్థలు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తాయి. అంతేకాక, సోషల్ మీడియా ద్వారా మరియు ఆన్‌లైన్ లైవ్ సెషన్‌లు కూడా నిర్వహించబడతాయి. అంతర్జాతీయ యోగ డే ద్వారా, యోగా ప్రపంచవ్యాప్తంగా ఒక సామాజిక ఉద్యమంగా మారింది. ఇది వివిధ వయస్సులు, సామాజిక హోదాలు మరియు సంస్కృతుల ప్రజలను ఒకే వేదికపై తీసుకొస్తుంది. యోగా కేంద్రాలు, ఆశ్రమాలు మరియు ఫిట్‌నెస్ సెంటర్లు పెరగడం వల్ల యోగా అందరికీ అందుబాటులోకి వచ్చింది. అంతేకాకుండా, యోగా శిక్షకులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి. యోగా ద్వారా సమాజంలో సానుకూల దృక్పథం మరియు ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. అంతర్జాతీయ యోగ డే అనేది కేవలం ఒక రోజు ఉత్సవం కాదు, ఇది ఆరోగ్యకరమైన మరియు సామరస్యపూరిత జీవనశైలిని అవలంబించేందుకు ఒక పిలుపు. యోగా యొక్క పురాతన వారసత్వం మరియు దాని శాస్త్రీయ ప్రయోజనాలు ఆధునిక జీవనంలో దాని ప్రాముఖ్యతను మరింత బలపరుస్తాయి. యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా, మనం శారీరకంగా, మానసికంగా మరియు ఆధ్యాత్మికంగా సమతుల్య జీవనాన్ని సాధించవచ్చు. ఈ యోగ డే సందర్భంగా, మనమందరం యోగాను అనుసరించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకుందాం.

- ప్రొద్దువాక భీమ రావు
9948635844

# ప్రజా ప్రభుత్వంపై విమర్శలా..?

■ మాజీ మంత్రి వ్యాఖ్యలపై అడ్డి భోజారెడ్డి ఫైర్



**ఆదిలాబాద్, మహా :** రైతులకు విత్తన సమయంలో పెట్టుబడి సాయం కింద అందిస్తున్నరైతు భరోసాపై బీఆర్ ఎస్ అనవసర విమర్శలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మండిపడ్డారు. రైతు బంధు కాదు ఎన్నికల బంధు అని మాజీ మంత్రి జోగురామన్న చేసిన వ్యాఖ్యలకు కౌంటరిచ్చారు.శుక్రవారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాజీ మంత్రి వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా భోజారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న మీరు వెలగబెట్టిందేంటని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ లన్నారు దాని ఊసేలేదు, ఉద్యోగ కల్పన అన్నారు ఒక్క ఉద్యోగమిచ్చిందిలేదని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేయలేదు,ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. రూ. 2లక్షల రుణమాఫీ, ఎకరానికి ఆరువేల రైతు భరోసా, పేదలకు సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండువందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500లకు గ్యాస్ సిలిండర్, రాజీవ్ యువవికాసం లాంటి మంచి పథకాలతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుంటే చూసి ఓర్వలేక లేని పోని విమర్శలు చేస్తున్నారని తెలిపారు. మీరు గత పదేళ్లలో ఏమీ చేయలేదు కాబట్టే ప్రజలు తగిన బుద్ధి చెప్పి ప్రతి పక్షంలో కూర్చోబెట్టారని , ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున రాజకీయ లబ్ధి పొందేందుకు తమ ప్రభుత్వంపై అనవసర బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. పాలన చేత కాక రూ.8లక్షల కోట్లు అప్పులు తమ ప్రభుత్వం నెత్తిన వేసి వెళ్లారని విమర్శించారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధిలో ఎక్కడా తగ్గకుండా అన్ని సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి అసలైన ప్రజాపాలన అందిస్తున్నారన్నారని కొనియాడారు. ప్రజలు మెచ్చిన ప్రభుత్వం పై మీరు ఎంత విమర్శలు చేస్తే అంతకంటే ఎక్కువ విమర్శలు మిమ్మల్ని వెంటాడతాయన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,మాజీ కౌన్సిలర్ సంద నర్సింగ్, నాయకులు దాసరి ఆశన్న, తమ్మల చందు, బందారి చిన్నయ్య, అశోక్, మోహిన్, సిరాజ్, వామన్, రమేష్,నాగన్న,రాగం సాంబయ్య,ఉగ్గె సంతోష్,మజర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

■ మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్
■ దిశా సమావేశానికి హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్
■ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,
■ కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలయ్యే ప్రతి పథకం అర్హులకు అందేలా నిధులు సక్రమంగా వినియోగించు కోవాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ బలరాం నాయక్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. కో చైర్మన్ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు జనవరి మాసంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశా సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు నియోజక వర్గాల వారీగా గ్రామాలలోని వివిధ సమస్యలను మహబూబాబాద్ ఖమ్మం ఎంపీల సమక్షంలో పరిష్కరించిన అంశాలను క్లుప్తంగా తెలియజేశారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ మిషన్ తదితర సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించే నిధులతో కొనసాగుతున్న పనులపై క్షుణ్ణంగా సమీక్షించారు. కేంద్రప్రభుత్వం పరిధిలోని 29 శాఖల పనితీరు పై చర్చించారు. ఇప్పటివరకు ఉన్న పురోగతి సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు సంబంధిత శాఖలు ఎలా ఖర్చు చేస్తున్నాయి.. అవి ప్రజలకు గ్రౌండింగ్ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ . కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాబట్టుకొని ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్తామని అన్నారు. ప్రభుత్వాలు ఎంత కష్టపడి పని చేసిన నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక ప్రకారం ప్రజల ప్రయోజనార్ధం అమలు చేసే ప్రతి పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరేగా పథకం క్రింద జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఉపాధి కూలికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుటకు చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మెరుగుపడాలని, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కేంద్రాల్లో మెరుగైన వైద్యం అందించడంతో పాటు, అన్ని వసతులు ఉండాలని, ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కుసుమ్ పథకం ద్వారా సోలార్ ఏర్పాటు వల్ల గిరిజనుల వ్యవసాయ అభివృద్ధితో పాటు ఆర్థికాభివృద్ధి సాధించగలుగుతారని అన్నారు. జిల్లాలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇల్లు,రెండు పడకగదుల ఇళ్లను అర్హులకు అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులకు నిధులు ఉపయోగించేలా చూడాలని అన్నారు. **ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ** కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు అందజేయడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిధులను వినియోగించుకోవాలన్నారు. విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాత్ రూమ్ ల నిర్మాణం చేపట్టి, ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు డ్రాప్ అవుట్ లను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. డాక్టర్ కోర్సు చేసినవారిని ఆసరాగా చేసుకొని కొందరు వైద్య వ్యాపారం చేస్తున్నారని అన్నారు. ఎప్పుడైన వైద్యం వికటించి ఎవరి ప్రాణాలమీదికైనా వస్తే చూసుకుందాంలే అన్నట్లుగా కాకుండా ఎప్పటికప్పుడు ప్రైవేటు ఆస్పత్రులపై తనిఖీలు నిర్వహించాలని వైద్య అధికారులకు ఎంపీ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ప్రోత్సహించాలని అన్నారు. నార్మల్ డెలివరీలు జరిగేలా గర్భిణులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ను గ్రామ స్థాయిలోనే నిర్వహించాలన్నారు.ట్రాన్స్ జెండర్లసమస్యలను పరిష్కరించాలన్నారు. వారిపట్ల ఉన్న వివక్షను పోగొట్టేందుకు, వారు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు వారికి సాయం అందించాలన్నారు. గుర్తింపు కార్డులతో పాటు ప్రత్యేక పథకాలను అమలు అయ్యేవిధంగా చూడాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని ఎంపీ సూచించారు. దీనికి అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో వరి సాగుతో పాటు ఇతర ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామీణప్రాంతాల్లో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పనుల పురోగతిలో అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ ప్రగతి పనులు వేగవంతం పూర్తి చేస్తామని అన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య జిల్లాలో పలు సమస్యలను దిశ కమిటీ చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఎయిడెడ్ పాఠశాల ఆస్తులను పరిరక్షించాలని కోరారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకొని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవలెబుల్..
# స్కూల్లలో ప్రవేశాలకు లక్కీ డ్రా



**ఆదిలాబాద్, మహా :** జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద ఆయా పాఠశాలల్లో ప్రవేశాల కోసం శుక్రవారం లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి పర్యవేక్షణలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన వారికి ఒకటో తరగతి, ఐదవ తరగతిలో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్ రావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యాల దేవి మాట్లాడుతూ ఒకటో తరగతిలో 45 సీట్లకు గాను 80 మంది, ఐదవ తరగతిలో 47 సీట్లకు గాను 140 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పించడం జరిగిందని, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ



**ఆదిలాబాద్, మహా :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూనియన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మావల మండలం దుబ్బగూడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, బుక్స్, పెన్నులు, మధ్యాహ్న భోజన ప్లేట్లను అందజేశారు. యూనియన్ దివంగత నేత తారకనాథ్ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది జూన్ 20న యూనియన్ డే కార్యక్రమం నిర్వహిస్తామని రీజనల్ సెక్రెటరీ సురేందర్ తెలిపారు.

# నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం




**ఆదిలాబాద్, మహా:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్లో నిర్వహిస్తున్నట్లు అయుష్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం రిమ్స్ ఆవరణలోని అయుష్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 27 నుంచి 25 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పాఠశాలలు, గ్రామాలు, అంగన్వాడీ కేంద్రాల్లో యోగా ప్రాముఖ్యతను గురించి తెలియజేసినట్లు చెప్పారు. హరిత యోగా కార్యక్రమంలో భాగంగా 27 అయుష్ కేంద్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. చివరి రోజు శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. రెవెన్యూ గార్డెన్ ఉదయం 6.30గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు యోగా అవగాహనతో పాటు అసానాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేతో పాటు అధికారులు, పట్టణ ప్రముఖులు హజరు కానున్నారని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## కర్మన్ ఘాట్ లో ఘనంగా.. గణపతి మహాసౌర,
# రుద్రసమేత చండికా హవనము



**హైదరాబాద్, మహా :** బ్రాహ్మణాభ్యుదయ పరిషత్ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్ లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ లో శుక్రవారం నుండి ఆదివారం వరకు ఋగ్వేద పండితులు దేరం భాస్కర శర్మ ఆధ్వర్యంలో గణపతి మహాసౌర, రుద్రసమేత చండికా హవనము నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు కురుమేటి శ్రీనివాస శర్మ, ప్రధాన కార్యదర్శి వంశీ శాస్త్రి, కోశాధికారి ఎల్లికంటి శ్రీనివాస శర్మ,సంఘ సభ్యులు బిన్నూరు నరసింహ శర్మ, మధు శర్మ,నరేందర్ శర్మ, రామ శర్మ , శ్రీనివాస్ ,సురేష్ తెలియచేశారు. శనివారం గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనములు కూడా ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు.

# పులి సంచారం పై ప్రజలు జాగ్రత్త వహించాలి




**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లాలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి తిరుగుతోందని ప్రజలు జాగ్రత్త వహించాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహాదేవపూర్ డివిజన్ అటవీ శాఖ అధికారి సందీప్ రెడ్డి సూచించారు. కాటారంలోని సెంట్రల్ నర్సరీని తనిఖీ చేశారు. మొక్కల ఎదుగుదల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పెద్దపులి బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్లపై అవగాహన కల్పించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రేంజ్ అధికారి స్వాతి,డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్ , బీట్ అధికారులు రాజేందర్,రాజ్ కుమార్ ఉన్నారు.

# విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి

■ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ పరిశీలన



**ఆదిలాబాద్,. మహా:** విధుల్లో పోలీసు సిబ్బందిఅందరికి క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రతతో పోలీస్ స్టేషన్ నిర్వహించాలని సూచించారు. కేసులలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి ప్రస్తుత స్థితి పై ఆరా తీశారు. రికార్డుల నవీకరణలను ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టుల్లో చార్జి షీటు దాఖలు చేయాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ ను కేటాయించి గ్రామాలలో జరుగుతున్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సందర్భంగా సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరిస్తూ, పూర్తి సంసిద్ధమై ఉండాలని తెలిపారు. డయల్ 100, బ్లూ కోర్ట్, పెట్రో కార్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రమాదాలను నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. కోర్టుల నందు పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల కోర్టుల నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వరమే న్యాయం అందించే విధంగా పోలీసు అధికారులను కేటాయించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ జి మొగిలి, ఎస్సై సాయన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒరిస్సా నుండి మహారాష్ట్రకు గంజాయి సప్లై

■ మంచి డిమాండ్ ఉండడంతో ఆ లేబర్ కు సప్లై చేసేందుకే తరలింపు
■ నలుగురిని అరెస్ట్ చేసిన రాచకొండ ఎస్ఓటి పోలీసులు
■ 166 కేజీల గంజాయి స్వాధీనం



**ఎల్బీనగర్,మహా:** ఒడిశా నుండి హైదరాబాద్ మీదగా మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్న ముఠాలోని నలుగురిని ఎల్బీనగర్ ఎస్ఓటీ ,హయత్ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుండి రూ. 65 లక్షల విలువైన 166 కేజీల ఎండు గంజాయి ,ఒక కారు,4 మొబైల్ ఫోన్లు, రూ.6200 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.శుక్రవారం ఎల్బీనగర్ లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి సుధీర్ బాబు వివరాల తెలిపారు..మహారాష్ట్రకు చెందిన వికాస్ బాబన్(30) పాత నేరస్తుడు,గంజాయి సరఫరా చేసే వ్యాపారి అదే ప్రాంతానికి చెందిన రంగనాథ్ యురాజన్ సాద్వే(36) రైల్వే ఉద్యోగి సాగర్ గజానన్ ఆలియస్ సాగర్(29) అదే ప్రాంతానికి చెందిన అమోల్ నారాయణ్ బోర్డ్ అనే డ్రైవర్ లు కలిసి ఓ ముఠా ఏర్పాడ్డారు. వికాస్ బాబన్ సాల్వేకు ఒడిశాకు చెందిన మైక్ ఆలియస్ రాహుల్ తో పరిచయం పెంచుకున్నాడు. వికాస్ బాబన్ విలాసవంతమైన జీవితం గడపాలని గంజాయిని విక్రయించడం ద్వారా త్వరగా డబ్బులు సంపాదించవచ్చని ప్లాన్ చేసుకున్నాడు.మహారాష్ట్రలోని కార్మికులలో ఎక్కవ మంది గంజాయికి బానిసలయ్యారని వారికి గంజాయికి విక్రకయించి త్వరగా ఎక్కువ డబ్బులు సంపాదించడానికి తన స్నేహితులతో కలిసి ప్రణాళిలను సిద్ధం చేసుకున్నాడు.దీంతో వివాస్ స్నేహిలులైన సాగర్ గజానన్, రంగనాథ్, అమోల్ నారాయణ ఒడిశా నుండి గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలోని కొనుగోలుదారులకు సరఫరా చేయడానికి హైదరాబాద్ మీదుగా రవాణా చేస్తున్నారు.ఈ క్రమంలో గురువారం ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్ గిరి నుండి మైక్ అలియాస్ రాహుల్ వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అక్కడి నుండి సాగర్ గజానన్, రంగనాథ్, అమల్ నారాయణ్,మైక్ లు కలిసి ఫోర్స్ ట్రాక్స్ క్రూయిజర్ లో హైదరాబాద్ మీదగా మహారాష్ట్రకు వెళ్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ,హయత్ నగర్ పోలీసులు హయత్ నగర్ పరిధిలోని ధనుంజయ ఫంక్షన్ హాల్ వద్ద వాహనాలను తనిఖీ చేసి కారులో సీట్ వెనుకల గంజాయి దాచి పెట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వికాస్, సాగర్ గజానన్, రంగనాధ్, అమల్ నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకొని.వారి వద్ద నుండి 166కిలోల గంజాయిని, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఇందులో ప్రధాన నిందితుడైన మైక్ అలియాస్ రాహుల్ పరారీలో ఉన్నాడని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.ఇందులో ప్రధాన నిందితుడు వికాస్ గతంలో గంజాయిని అక్రమ సరఫరా చేసే కేసులో ఆలేరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినట్లు తెలిపారు.అతనిపై ఎన్ బీ డబ్ల్యు( నాన్ బెయిలబుల్ వారెంట్) కేసు పెండింగ్ లో ఉందని, రంగనాద్ పై భద్రాచలం పట్టణ పిఎస్ లో కేసు పెండింగ్ లో ఉందని తెలిపారు.రాచకొండ పోలీసులు మాదకద్రవ్యాల అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటీ అడిషనల్ డీసీపీ షకీర్ హుస్సేన్, హయత్ నగర్ సిఐ నాగరాజు పాల్గొన్నారు.



## ఇక సహించం.. కొండా మురళి వ్యాఖ్యల పై భగ్గుమన్న ఎమ్మెల్యేలు

**హన్మకొండ మహా;** ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, వరంగల్ మేయర్, కుడా చైర్మన్, ఉమ్మడి జిల్లా నాయకులు హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సొంత పార్టీ నేతల పై చేసిన అనుచిత వ్యాఖ్యల పై భగ్గుమన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారి పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో నిధులు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. మేమంతా జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తుంటే కొందరు పార్టీకి నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని రాజేందర్ రెడ్డి తెలిపారు. "బీసీ కార్డును అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం సరికాదు. ప్రతి ఒక్కరూ పార్టీ అధిష్టానానికి కట్టుబడి ఉండాలి" అని ఆయన అన్నారు. పార్టీ మంచి చెడులపై ఈ సమావేశంలో చర్చించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. "ఎవరూ పార్టీకి నష్టం జరిగే విధంగా మాట్లాడకూడదు" అని ఆయన అన్నారు. పార్టీ పెద్దలు నటరాజన్ చెప్పినట్లుగా ఏమైనా సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలని సూచించారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే పార్టీ ఉపేక్షించేది లేదని మీరు చేసిన తప్పులకు కులాలను అడ్డం పెట్టుకుని వ్యవహరించ వద్దని రోడ్డు మీద పడి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. ఇలా మాట్లాడటం వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతి నియోజకవర్గంలో సన్న బియ్యంతో పాటు వివిధ సంక్షేమ పథకాల పై ప్రజలకు అవగాహన కలిపిస్తూ వారికి సేవ చేస్తూ తిరుగుతున్నామని, పార్టీలో సీనియర్ నాయకులుగా ఉండి ఇలా ప్రవర్తించడం సరికాదు అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ఈ విషయం పై సహించేది లేదని జరిగిన పరిణామాలను కూలంకషంగా అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తామని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకత్వంలో పెరుగుతున్న అసంతృప్తిని, పార్టీ ఐక్యతను దెబ్బతీసే వారి పై చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తో పాటు మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, పాల్గొన్నారు.

# అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

- సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక అభివృద్ధి.. కాంగ్రెస్ సిద్ధాంతం
- స్వరాజ్య స్ఫూర్తితో స్వయం విశ్వాసంతో నడవాలి
- పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్
- స్కూల్స్ నిర్మించడం కాదు నిర్వహించడమే సమస్య
- అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క









**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆర్థిక అభివృద్ధి తో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రం లోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాదులోని the westin, mindspace లో అసోచామ్ సదరన్ CSR &sustainability కౌన్సిల్ సదస్సు, అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి పని చేస్తుంది అన్నారు. మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం అన్నారు. 'ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పని చేయలేవని స్పష్టం అయ్యింది, ఇప్పుడు కేవలం 'లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అనివార్యం అన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆసిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుంది అన్నారు. పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి, మీ పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని డిప్యూటీ సీఎం ఉద్బోధించారు. కార్పొరేట్ సంస్థలు CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అన్నారు. ఈ రాష్ట్రంలో మీరు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాదు, ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉందని దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో CSR నిధులు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు. ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదు, శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుందని అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రైన్స్ వంటి రంగాల్లో తెలంగాణది తిరుగులేని ప్రస్థానం అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్లో, ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేసాం అన్నారు. స్కూల్స్ నిర్మించడం కాదు వాటిని నిర్వహించడమే సమస్య అని ఓ మిత్రుడు సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాణ కోసం కార్పొరేట్ కంపెనీలను సంప్రదించగా గొప్ప స్పందన కనిపించింది, ఆ పాఠశాలలన్నిటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అన్నారు. గతంలో నిర్మించిన 100 ఐటిఐ లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని డిప్యూటీ సీఎం తెలిపారు. CSR అంటే లాభాల్లో రెండు శాతం ప్రజాహిత కార్యక్రమాలకు కేటాయించడానికి చట్టపరమైన బాధ్యతగా చూస్తాం, కానీ నేను ఒక భిన్నమైన దృష్టి కొనాన్ని సమావేశానికి హాజరైన వారితో పంచుకోవాలని కోరుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజాన్ని పరిగణలోకి తీసుకోని అభివృద్ధి సరైనది కాదు, ప్రయోజనం లేని లాభం శూన్యమే అన్నారు. సుస్థిరత అనేది పర్యావరణానికి మాత్రమే పరిమితం కాదు అది మానవ గౌరవాన్ని కూడా కలిగి ఉండాలన్నారు, అభివృద్ధి ఫలితాలు కేవలం కార్పొరేట్ ఆఫీసులకే పరిమితం కాకూడదు, అవి ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అంతరించిపోతున్న గ్రామీణ కళాకారులకు చేరాలి అన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను మేము ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చే సంస్థలు గా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నాం అన్నారు. పల్లెల్లో యువతకు గ్రీన్ స్కిల్ స్ లో శిక్షణ, మహిళా సంఘాలకు కేవలం నిధులు మాత్రమే కాకుండా యంత్రాలు, శిక్షణ, మార్కెటింగ్ పై అవగాహన కల్పించాలని ఒకేసారి నిధులు కేటాయించడం కాదు దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గదర్శకులుగా మారుద్దాం అని డిప్యూటీ సీఎం అన్నారు. మీరు పని చేసే ప్రాంతాల్లో ప్రజల జీవన అనుభవాలను తెలుసుకోవాలని, స్థానిక ప్రజా సంస్థలతో కలిసి పని చేయాలని సూచించారు. నిర్మించిన భవనాలు పాతవి అవుతాయి కానీ ప్రజల నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వంవంటిఅంశాలు నిరంతరం ప్రభావాన్ని చూపుతాయి అన్నారు. ప్రతి CSR పథకం ప్రజలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేయాలి, చేతులు చాచేలా కాదు, స్వరాజ్య స్ఫూర్తితో స్వయం విశ్వాసంతో నడవాలి అని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల పాల్గొన్నారు.

## భద్రకాళి బోనం పై ఎమ్మెల్యే నాయిని అభ్యంతరం



**వరంగల్ మహా ;** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం ఓరుగల్లు వాసుల ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆలయంలో బోనం సమర్పించాలన్న నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ మరోసారి పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో జంతు బలులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అంతేకాదు, మద్యం తాగి ఆలయంలోకి ప్రవేశిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. బోనం సమర్పణ సంప్రదాయం పై ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారికి గతంలో ఎన్నడూ బోనం సమర్పణ చేయలేదని గుర్తు చేశారు. గ్రామ దేవతలకు మాత్రమే బోనం సమర్పణ జరుగుతుందని, భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వరంగల్ నగరంలో చాలా చోట్ల గ్రామ దేవతలు ఉన్నారని, బోనం సమర్పించాలనుకుంటే అక్కడ సమర్పించాలని ఆయన సూచించారు. భద్రకాళి అమ్మవారికి బోనం సమర్పణ పై తీవ్ర అభ్యంతరాలు, అనేక ఫిర్యాదులు వచ్చాయని నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. నగరవాసుల ఫిర్యాదుల మేరకు మంత్రి కొండా సురేఖ బోనం సమర్పణపై మరోసారి పునరాలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తొలిసారి నకిలీ విత్తనాలు,పురుగు మందులు విక్రయించిన వ్యక్తి పై పీడీ యాక్ట్





**వరంగల్ మహా;** రాష్ట్రంలో తొలి సారి నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తి పై వరంగల్ పోలీస్ కమిషనర్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులతో పాటు కాలం తీరిన పురుగు మందులను విక్రయించిన వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో ఇరుకుళ్ళ వేద ప్రకాష్ పై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను అమలు చేసి మట్టెవాడ ఇన్స్ స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి నిందితుడిని పరకాల జైలుకు వెళ్లి అక్కడి అధికారులకు పత్రాలు అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.... పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు మరో ఆరుగురు నిందితులతో కలసి ఒక ముఠా ఏర్పడి.. కాలం తీరిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుండి తక్కువ డబ్బుకు కొనుగోలు చేయడం తో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తూ మట్టెవాడ పోలీసులకు గత నెల ఏప్రిల్ 7 వ తారీఖున నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 49 లక్షల52 వేల రూపాయల విలువ గల నకిలీ విత్తనాలు, పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడు మరో మరోమారు నెల 26వ తారీఖున నకిలీ పురుగు మందులు విక్రయిస్తుడడంతో మట్టెవాడ పోలీసులు మరో మారు అరెస్ట్ చేసి అతని నుండి 11వేల రూపాయల విలువ నకిలీ పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మరో కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు అయినట్లు సీపీ వెల్లడించారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, పరుగు మందులను విక్రయిస్తే పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేయబడుతుందని, అలాగే ఎవరైన విక్రయిస్తే 7799848333 నంబర్ కు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## వైద్యులు, సిబ్బంది తమ తీరును మార్చుకోవాలి

- 3 గంటల పాటు ఎంజీఎం మొత్తం కలియ తిరిగిన కలెక్టర్



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఎంజీఎం దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించుటకు కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించి ఐసీయు, పిడియాట్రిక్స్, జనరల్, ఓపి పేషెంట్ అటెండెంట్స్, నిరీక్షణ గది, తదితర విభాగాలను పరిశీలించారు. దవాఖానల్లో మౌలిక వసతులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న వైద్య సేవల పై సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, ఆర్ఎంవో, విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్య అధికారులతో క్షేత్ర స్థాయిలో కలియ తిరిగి ఆసుపత్రి పరిసరాలు, పారిశుద్ధ్యం పరిశీలించి సమస్యలు తెలుసుకొని పరిష్కరణకు తగు సూచనలు చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న క్యాంటీన్ ను ఇతర స్థానానికి మార్చాలని, అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. హృదయ చికిత్స విభాగంలో అమర్చిన కంప్లైంట్ బాక్స్ ను కలెక్టర్ తెరవగా, సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని , సిబ్బంది దురుసుగా వ్యవహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొనగా, వైద్యులు తమ తీరును మార్చుకొని మానవతా దృక్పథంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. వైద్యులకు, సిబ్బందికి తప్పనిసరిగా ఐడి కార్డులు ఉండాలన్నారు. దవాఖాన ఆస్తుల రక్షణ, రోగుల భద్రతా విషయంలో సెక్యూరిటీ సంస్థ బాధ్యత వహించాలని, జూనియర్ డాక్టర్ల తోపాటు సెక్యూరిటీ, శానిటరీ, పేషెంట్ కేర్ సిబ్బందికి వేర్వేరుగా భద్రతా అంశాల పై కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంజిఎం పర్యవేక్షకులు కిశోర్, డి ఎం హెచ్ ఓ, ఎంపిడిసిల్ డీఈ మల్లికార్జున్, డిబిసిడిఓ పుష్పలత, ఆర్ ఎం ఓలు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్, ఎమ్మెల్యే



**హన్మకొండ మహా;** బల్దియా పరిధి 10 వ డివిజన్ లోని మచిలిబజార్ కాపు వాడ జెండా ప్రాంతం లో కార్పొరేషన్ సాధారణ నిధులు రూ 21.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి.సి రోడ్డు, సి సి డ్రైన్ తో పాటు ఆర్ సి సి స్లాబ్ నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమం లో జీ డబ్ల్యూ ఎం సి ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఈఈ రవి కుమార్, డిఈ రాజ్ కుమార్, ఏ ఈ హరికుమార్, తో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**రీసెర్చ్ యూనిట్ ఏం ఆర్ యు ప్రారంభం**

ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్( ఐ సి ఎం ఆర్ న్యూఢిల్లీ) వారి ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ (డి హెచ్ ఆర్) వారి సహకారం తో కాకతీయ మెడికల్ కళాశాలలో (కే ఎం సి) లో నూతనం గా ఏర్పాటు చేసిన మల్టీ డిసిప్లీనరీ రీసెర్చ్ యూనిట్ ఏం ఆర్ యు ను వరంగల్ లోక్ సభ సభ్యురాలు కడియం కావ్య వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయ లక్ష్మి సురేందర్, కళాశాల ప్రిన్సిపల్ డా.కే. రాంకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి



**మానకొండూర్,మహా:** అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నట్టు మానకొండూర్ ఎమ్మెల్యేడాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.శుక్రవారం మానకొండూర్ మండలంలోని ఊటూరు,రంగపేట, లక్ష్మిపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో వివిధ శాఖల ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నట్టు చెప్పారు. చేపట్టిన పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకందారులకు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీలను ఇప్పటికే అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రజల నుంచి డిమాండ్ లేనప్పటికీ వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని ఆయన చెప్పారు. త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతీ యువకులకు రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని చేపడుతుందని ఆయన వివరించారు. ఆ వెనువెంటనే కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టనున్నదని ఆయన చెప్పారు. మానకొండూర్ మండలం ఊటూరు గ్రామంలో జడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రైన్ ను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ప్రారంభించారు. అలాగే ఎన్ఆర్ఈజీఏ నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ఎస్సీ కాలనీలో ఎస్డీఎఫ్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ప్రారంభిచారు. రంగపేట గ్రామంలో ఎన్ఆర్ఈజీఏ కింద 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. లక్ష్మీపూర్ గ్రామంలో కోటి 56 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ రవిప్రసాద్, ఏఈ వెంకన్న, మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్,ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,ద్యావ శ్రీనివాస్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమాల్ రెడ్డి, కోండ్ర సురేష్, కనకం అశోక్, బి.సునీల్, శంకర్, స్వామి రంగ స్వామి, శ్రీనివాస్ మల్లేష్, కుమర్ ఎడ్ల సతీష్, ఎం .నాగిరెడ్డి,చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర మహాసభలు





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసి స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ (SWF) 4వ రాష్ట్ర మహాసభలు జూన్ 21, 22 తేదీలలో ఖమ్మం నగరంలో కామ్రేడ్ నేపాల్దేవ్ నగర్ &ఎర్రా శ్రీకాంత్ హాలులోజరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతంగా చేయాలని, ఆర్టీసి కార్మికులు ఎదుర్కొంటున్న, ప్రతి సమస్య పైన ఎస్ డబ్ల్యూ ఎఫ్ స్పందించింది. అంతేకాక ఆ సమస్యల పరిష్కారానికి తన వంతుగా పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు, ప్రజలు, ప్రభుత్వం, యాజమాన్యాల ముందు ఉంచి, వాటి అమలుకై ఆందోళనలు, పోరాటాలు చేసింది. కేంద్ర ప్రభుత్వం గుట్టుగా కర్మికుల పట్ల ఆటంకాలు... ఈపీఎస్95 స్కీములోని హైయర్ పెన్షన్ అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం గుట్టుగా తీసుకొస్తున్న ఆటంకాలను, లోపాలను ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఎప్పటికప్పుడు వివరిస్తోంది. పిఎఫ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బర్కత్ పుర కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఎస్ డబ్ల్యూ ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలో కొత్త నిర్ణయాలు తీసుకొని, భవిష్యత్తు పోరాటాల కోసం నిర్ణయాలు తీసుకుంటారు. కాబట్టి నేడు, రేపు ఖమ్మంలో జరిగే 4వ SWF రాష్ట్ర మహాసభలను విజయవంతం చెయ్యాలని, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ముందు వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ డిపో ఎస్ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్షులు చెరుకూరి నరసింహ, డిపో కార్యదర్శి పల్నాటి జంగయ్య, డిపో కోశాధికారి దిలీప్ నాయక్ పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ | 21-06-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM


# అడ్వాన్స్‌గా ఆరు నెలల రెంట్.. ఆపై ఎన్నో ఛార్జీలు



బెంగళూరులో కఠినమైన అద్దె విధానాలపై రెడ్డిట్ యూజర్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో బెంగళూరు హౌసింగ్ మార్కెట్లో అద్దెదారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న నిబంధనల పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అద్దెకు ఉండడం కంటే డబ్బు ఖర్చయినా సొంతంగా ఇల్లు కొనడం బెటర్ అనే ధోరణికి వస్తున్నట్లు చెప్పారు. కొంతకాలంపాటు బెంగళూరు నగరం బయట అద్దెకు ఉన్న ఒక యూజర్ ఇటీవల నగరం లోపలకు మకాం మార్చినట్లు చెప్పారు. తమ కొత్త ఇంటి యజమాని అసంబద్ధమైన డిమాండ్లు పెడుతున్నాడని రాశారు. బెంగళూరులో ఆరు నెలల సెక్యూరిటీ డిపాజిట్ నిబంధనను తప్పుబడుతూ 'మొదట వారు ఆరు నెలల డిపాజిట్, అడ్వాన్స్ రెంట్ తీసుకుంటారు. మీరు ఖాళీ చేయాలనుకున్నప్పుడు ఇంటిని తిరిగి శుభ్రం చేయించేందుకు, కొత్తవారి కోసం మీరు వాడిన వస్తువులను మార్చేందుకు డబ్బు అవసరం అవుతుందని చెప్పి అధిక మెయింటెనెన్స్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. డిపాజిట్ తిరిగి ఇచ్చే ఉద్దేశం కూడా వారికి లేదు' అని రాసుకొచ్చారు.

బెంగళూరు రియల్టీ మార్కెట్‌లో సాధారణంగా అద్దెదారుల నుంచి ఆరు నెలల సెక్యూరిటీ డిపాజిట్‌ను తీసుకుంటున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. అందుకే నగరంలో స్వల్పకాలిక నివాసం ఉన్నవారు కూడా సొంతంగా ఫ్లాట్ కొనుగోలు చేసి ఈ దోపిడీ నుంచి బయటపడాలనుకుంటున్నారని రెడ్డిట్ యూజర్ పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. 'వారు ఆ డిపాజిట్‌ను ఉపయోగించి ఇంటిని పునరుద్ధరిస్తారు. అది మా డబ్బు. ప్యూర్ టార్చర్' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. 'నా మునుపటి ఇంటి యజమాని తన ఇంటి గోడలపై 12 చోట్ల పెయింటింగ్ పోయినందుకు మొత్తం పెయింటింగ్ అయ్యే ఖర్చును వసూలు చేశాడు' అని మరో యూజర్ రిప్లై ఇచ్చాడు.

# నర్సరీ ఫీజు కంటే ఇంటి అద్దె చీప్!



ప్రతి దేశంలో ఆరోగ్య సంరక్షణ, రవాణా, అద్దె, ఆహారం, యుటిలిటీల ఖర్చును పరిశీలించి చౌకైన దేశమా? ఖరీదైన దేశమా? అని నిర్ణయిస్తారు. విలియం రస్సెల్ అనే రిసెర్చ్ అనలిస్ట్ 2025లో మూడు చౌకైన ప్రాంతాల వివరాలు వెల్లడించారు. అందులో వియత్నాం ముందు వరుసలో నిలిచింది.

వియత్నాం ప్రవాసులు జీవించడానికి అత్యంత చౌకైన దేశంగా ఉందని విలియం రస్సెల్ తెలిపారు. మంచి ఆహారం, స్నేహపూర్వక స్థానికులు, ఆధునిక సౌకర్యాలు, పురాతన సంప్రదాయాలు అన్నీ వియత్నాంలో ఉన్నాయని చెప్పారు. నెలకు సగటున సింగిల్‌బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు 265 పౌండ్ స్టెర్లింగ్(రూ.30 వేలు), మూడు పడక గదుల అపార్ట్‌మెంట్‌కు 589 పౌండ్ స్టెర్లింగ్(రూ.68 వేలు) ఖర్చవుతుందని అన్నారు. వియత్నాంలో మొత్తం జీవన వ్యయం యూకే కంటే 59 శాతం చౌకగా ఉందని తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్‌లో ఏటా నర్సరీ ఫీజు రూ.1లక్షపైనే ఉందని కొందరు చెబుతున్న నేపథ్యంలో వియత్నాంలోని ఇంటి అద్దెలు వాటి కంటే చీప్‌గా ఉన్నట్లు తెలుస్తుంది.

బొలీవియా ప్రవాసులకు రెండో అత్యంత చౌకైన దేశంగా ఉందని చెప్పారు. రాజధాని లా పాజ్‌లో ఒక పడకగది అపార్ట్‌మెంట్ ధర నెలకు 386 డాలర్లు (రూ.33 వేలు), మూడు పడక గదుల అపార్ట్‌మెంట్ ధర 707 డాలర్లు(రూ.45 వేలు) అని అన్నారు. జార్జియా మూడో చౌకైన గమ్యస్థానంగా ఉందని విలియం చెప్పారు.



# స్వల్పంగా పెరిగిన డుగ్గు డుగ్గు బండి ధరలు!

రాయల్ ఎన్‌ఫీల్డ్ తన ఐకానిక్ బుల్లెట్ 350 సిరీస్ ధరల్లో స్వల్ప మార్పులు ప్రకటించింది. వేరియంట్‌ను అనుసరించి ధరను రూ.2,000 నుంచి రూ.3,000 వరకు పెంచినట్లు తెలిపింది. దాంతో బేస్ వేరియండ్ ధర రూ.1.75 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమై ప్రీమియం మోడల్ ధర రూ.2.18 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంది.
ఈ ధరల పెంపుతో పాటు బుల్లెట్ సిరీస్‌లో అప్‌డేటెడ్ మోడల్ బెటాలియన్ బ్లాక్‌ను ప్రవేశపెట్టింది. బెటాలియన్ బ్లాక్ బేస్ ధర రూ.1.75 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉంది. ఆకట్టుకునే డిజైన్‌తో బ్లాక్ బాడీ, గోల్డెన్ హ్యాండ్ పెయింటెడ్ పిన్ స్ట్రిప్స్, రెట్రో టెయిల్ లైట్, స్కూప్డ్ సింగిల్ సీట్, రియర్ డ్రమ్ బ్రేక్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఇంతకు ముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ మిలిటరీ వేరియంట్ ధర ఇప్పుడు రూ.1.76 లక్షలకు చేరింది. రెడ్, బ్లాక్ రంగులలో లభిస్తుంది. దీనిపై రూ.2000 ధర పెరిగింది. బ్లాక్, మెరూన్ రంగుల్లో లభించే స్టాండర్డ్ వేరియంట్ ధర రూ.3,000 పెరిగింది. దీని ధర రూ.2 లక్షలు (ఎక్స్‌షోరూమ్). బ్లాక్ గోల్డ్ ఎడిషన్ ఇప్పుడు రూ.2.18 లక్షలకు (ఎక్స్‌షోరూమ్) రూ .2,000 పెరిగింది.

# ఫైనాన్షియల్ సెక్టార్‌పై మస్క్ కన్ను




ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్ ఇప్పుడు ఫైనాన్షియల్ సెక్టార్‌పై కన్నేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష ప్రయాణాలు, సామాజిక మాధ్యమాల్లో తనదైన ముద్ర వేసిన తర్వాత మస్క్ తన ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఆర్థిక సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఫీచర్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం.


ఎక్స్ యూజర్లు ప్లాట్‌ఫామ్ నుంచి బయటకు వెళ్లకుండా షాపింగ్, టిప్పింగ్, మనీ మేనేజ్‌మెంట్.. వంటి మరెన్నో లావాదేవీలను నిర్వహించేందుకు వీలు కల్పించేలా సమగ్ర ఆర్థిక ఎకోసిస్టమ్‌ను రూపొందించమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రణాళికలో భాగంగా ఎక్స్ బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డులను త్వరలో విడుదల చేయాలని భావిస్తున్నారు. ముందుగా యూఎస్‌లో ఈమేరకు మార్పులు చేయబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. క్రమంగా ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పాయి.

## వీసాతో ఒప్పందం

వీసా సంస్థ ఇప్పటికే ఈమేరకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ మొదటి చెల్లింపుల భాగస్వామిగా సంతకం చేసింది. ఎక్స్ మనీగా పిలిచే ఈ సేవలో డిజిటల్ వాలెట్, పీర్ టుపీర్ పేమెంట్ ఫంక్షన్లు ఉంటాయి. వీటి ద్వారా ఎక్స్‌లో వినియోగదారులు కొనుగోళ్లు చేయవచ్చు. వాలెట్‌లో మనీ నిల్వ చేసుకోవచ్చు. 'మీరు ఎక్స్‌లోకి వెళ్లి మీ ఆర్థిక లావాదేవీలన్నింటినీ నిర్వహించగలరు' అని ఎక్స్ సీఈఓ లిండా యాకారినో కేన్స్ లయన్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ క్రియేటివిటీలో పేర్కొన్నారు.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# వెండి, ఇత్తడి కళాకృతులు.. పెయింటింగ్‌లు

### జీ7 దేశాల నేతలకు ప్రధాని మోదీ ప్రత్యేక కానుకలు









న్యూఢిల్లీ: ఇతర దేశాల నేతలను కలిసినప్పు డు కానుకలు అందజేయడమనే ఆనవాయితీని మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనసాగిస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం కెనడాలోని జరిగిన జీ7 శిఖరాగ్ర భేటీలో ఆయన పాల్గొనడం తెల్సిందే. ఈ సందర్భంగా ఆయన ఆతిథ్య దేశ ప్రధాని మార్క్ కార్నీతోపాటు ఆయా దేశాల నేతలకు కలకాలం గుర్తుండిపోయే, మన ఘన వారసత్వాన్ని ప్రతిబింబించే అద్భుత మైన కానుకల్ని అందజేశారు. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇత్తడి, వెండి కళాకృతులతోపాటు ఆకర్షణీయమైన పెయింటింగ్‌లున్నాయి.

కెనడాలోని కననాస్కిస్‌లో జీ7 భేటీ సమయంలో ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీకి ప్రధాని మోదీ ఇత్తడితో రూపొందించిన బోధి చెట్టు కళా ఖండాన్ని కానుకగా అందజేశారు. గౌతమబుద్ధునికి బోధి వృక్షం కిందనే జ్ఞానోదయమైన విషయం తెల్సిందే. జ్ఞానం, శాంతి, ఆధ్యాత్మిక మేల్కొలుపును ప్రతిబింబించేలా బిహార్ కళాకారులు రూ పొందించిన కళారూపమిది. అదేవిధంగా, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ కు తమిళనాడుకు చెందిన డోక్రా నిపుణులు రూపొందించిన నంది విగ్రహాన్ని బహూక రించారు. పరమ శివుని వాహనం నందీశ్వరుడు. సంప్రదాయ భారతీయ లోహ కళను చాటి చెప్పేలా ఈ విగ్రహం కనిపిస్తుంది.

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ పర్డోకు సంప్రదాయ వర్లి కళాఖండాన్ని కానుకగా ఇచ్చారు. మహారాష్ట్రలోని వర్లి గిరిజనుల జానపద కళ ఇది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌కు సంప్రదాయ మధుబని పెయింటింగ్‌ను అందజేశారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డోక్రా కళాకృతిలో రూపుదిద్దుకున్న ఇత్తడి గుర్రం బొమ్మను దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు ప్రధాని మోదీ బహూకరించారు.

పురాతన సంప్రదాయ నైపుణ్యంతో గిరి జన చేతిపనివారు రూపొందించిన బొమ్మ ఇది. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లులా డ సిల్వాకు వెదురుతో తయారు చేసిన హంస ఆకారంలోని పడవ బొమ్మను అందజేశారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌కు కల్హాపురి వెండి పాత్రను బహుమతిగా ఇచ్చారు. స్వచ్ఛమైన వెండితో తయారైన ఈ పాత్రపై చేతిలో రూపొందించిన పూల నగిషీలున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఈ కళాకృతి అందంతోపాటు ఘన వారసత్వాన్ని చాటుతోంది. జర్మనీ చాన్సెలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌కు పాలరాతి తో రూపొందించిన సూర్య దేవాలయాన్ని గుర్తుకు తెచ్చే కోణార్క్ చక్రం బొమ్మను బహుమతిగా ఇచ్చారు ప్రధాని మోదీ.

# అమెరికాతో మాకేంటి.. ఇరాన్ సంగతి మేమే తేలుస్తాం: నెతన్యాహు



టెలీ అవీవ్: ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య భీకర యుద్ధం కొనసాగుతున్న వేళ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అణు కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందన్నారు. న్యూక్లియర్ స్థావరాలపై దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం వేచి చూడలేము అంటూ కామెంట్స్ చేశారు. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు మాట్లాడుతూ..'ఇరాన్‌పై దాడిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేరాలనుకుంటున్నారా లేదా అనేది పూర్తిగా ఆయన వ్యక్తిగత నిర్ణయమే. ఇరాన్‌లో ఫోర్డ్‌లోని భూగర్భ అణు కేంద్రంతో సహా ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇరాన్‌లో అణు కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు ఉంది. ఇందుకు అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు వేచి చూసే ఆలోచనేమీ లేదు. ఇప్పటివరకు నిర్వహించిన దాడుల విషయంలో కూడా యూఎస్ ఆదేశాల కోసం వేచి చూడలేదు. ఇరాన్‌లో పరిపాలనను పతనం చేసే ఉద్దేశం మాకు లేదు. అది పూర్తిగా ఆ దేశ ప్రజలకు సంబంధించిన విషయం' అని చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్‌తో కలవాలని అటు అమెరికా అనుకుంటున్నట్టు సమాచారం. ఈ మేరకు ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే విషయంలో ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని వైట్ హౌస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

# క్షమాపణలు చెప్పిన బ్యూటీఫుల్ ప్రధాని



థాయ్‌లాండ్ యువ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా(38)కు అధికారం చేపట్టిన పది నెలలకే పదవీగండం ఎదురైంది. పొరుగుదేశం నేతకు ఆమె చేసిన ఓ ఫోన్ కాల్ లీక్ అవడం.. ఏకంగా ప్రధాని పీఠానికి ఎసరు పెట్టింది. ఆమెను రాజీనామా చేయాలంటూ ఒకవైపు డిమాండ్లు వెల్లువెత్తగా.. ఇప్పటికే సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన భాగస్వామి మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. థాయ్‌లాండ్ బిలియనీర్, మాజీ ప్రధాని అయిన తక్సిన్ షినవత్రా కుమార్తె ప్రస్తుత థాయ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా . గతేడాది ఆగస్టులో ఆమె ఆ పదవిని చేపట్టారు. 37 ఏళ్లకే ప్రధాని పీఠాన్ని అధిష్టించిన ఆమె.. ఆ దేశ చరిత్రలోనే అతి పిన్న ప్రధానిగా, రెండో మహిళా ప్రధానిగా చరిత్ర సృష్టించారు. అంతేకాదు.. అందం, ఫ్యాషన్స్‌లోనూ స్టైల్ ఐకాన్‌గా, బ్యూటిఫుల్ పీఎంగా నెట్టింట విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు.

**కాల్ సంభాషణ బయటకు..**

థాయ్‌లాండ్‌కు పొరుగున ఉన్న కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌కి థాయ్ ప్రధాని షినవత్రా ఫోన్ చేశారు. ''అంకుల్'' అంటూ ఆయనను సంబోధించిన ఆమె.. తన దేశంలోని పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సరిహద్దులో థాయ్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ బూన్‌సిన్ తనకు వ్యతిరేకంగా ఉన్నట్లు ఆమె ఆయనతో చెప్పారు పేర్కొన్నారు. అయితే, జూన్ 15వ తేదీన జరిగిన ఈ ఫోన్‌కాల్ సంభాషణ తాజాగా బయటకు వచ్చింది. సాధారణంగానే కంబోడియాథాయ్‌లాండ్‌ల మధ్య సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పైగా సరిహద్దు వివాదాల కారణంగా ఈ మధ్యకాలంలో(మే 28వ తేదీ నుంచి) అవి మరింతగా దెబ్బతిన్నాయి. అయితే.. 2023లో హున్ సేన్ ప్రధాని పదవి నుంచి దిగిపోగా.. ఆయన కుమారుడు హున్ మానెట్ అధికార పగ్గాలు చేపట్టారు. పదవిలో లేకపోయినా కంబోడియా రాజకీయాలను ప్రభావితం చేయగల వ్యక్తి హున్‌సేన్. అలాంటి వ్యక్తితో షినవత్రా ఫోన్‌లో మాట్లాడడం.. పైగా దేశ భద్రతకు సంధించిన విషయాలను ప్రత్యర్థితో పంచుకున్న తీరు కూడా వివాదాస్పదమైంది. సొంత పక్షం నుంచే ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రధాని ఫోన్‌తో తమ దేశ పరువు, ఆర్మీ గౌరవం దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ షినవత్రా సంకీర్ణ ప్రభుత్వం నుంచి కన్జర్వేటివ్ భూమ్‌జాయ్‌థాయ్ పార్టీ విడిపోయింది. ప్రస్తుతం థాయ్ పార్లమెంట్‌లో కనీసం 69 మంది ఎంపీలు ఆమెకు మద్దతు విరమించుకున్నారు. దీంతో షినవత్రాకు స్వల్ప మెజార్టీ(500 సభ్యులన్న పార్లమెంట్‌లో 254 సభ్యుల మద్దతు) మాత్రమే మిగిలింది. ఈ వివాదం ఇలాగే కొనసాగినా.. మరో మిత్రపక్షం వైదొలిగినా.. ప్రభుత్వం కుప్పకూలడం ఖాయంగా కనిపిస్తోంది.

**చేతులు జోడించి..**

ఈలోపు ఈ బ్యూటీఫుల్ ప్రధాని డ్యామేజ్ కంట్రోల్‌కి దిగారు. ఫోన్ కాల్ లీక్ వ్యవహారంపై ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఆర్మీ, పోలీస్ అధినేతల సమక్షంలో చేతులు జోడించి ఆమె ఆ పని చేశారు. నా ఉద్దేశం శాంతిని నెలకొల్పడమే. ఇకపై హున్ సేన్‌తో ప్రైవేట్ సంభాషణలు ఉండవని తేల్చి చెప్పారామె. దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకోవాల్సిన అవసరం అందరికీ ఉందని, సైన్యానికి అన్ని విధాలా ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారామె. ఈ క్షమాపణ థాయ్‌లాండ్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడకుండా ఆపుతుందా చూడాలి.

# విద్యార్థి వీసాల ప్రక్రియ ప్రారంభం

### దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీ తప్పనిసరి ప్రొఫైల్లను 'పబ్లిక్' మోడ్‌లో ఉంచాలని అమెరికా సూచన




**వాషింగ్టన్:** ఉన్నత విద్యకోసం అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు ఆ దేశం శుభవార్త చెప్పింది. కొంతకాలంగా తాత్కాలికంగా నిలిపేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్టు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. వీసా కోసం అప్లై చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా అకౌంట్లను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని ప్రకటించింది. దీనికోసం తాజాగా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. 'సోషల్ మీడియా తనిఖీల ద్వారా మా దేశంలోకి రావాలనుకునే ప్రతి వ్యక్తిని సమగ్రంగా పరిశీలించడానికి వీలవుతుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవసీ సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'గా మార్చుకోవాల్సి ఉంటుంది' అని అమెరికా విదేశాంగ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అమెరికా స్టూడెంట్ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను ట్రంప్ సర్కార్ ఈ ఏడాది మే చివరి వారంలో తాత్కాలికంగా నిలిపేసింది. అమెరికా రావాలనుకునే విద్యార్థుల సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించేందుకు సన్నాహాలు చేస్తున్నామని.. అందుకే వీసాల జారీని ఆపేసినట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తుదారుల సోషల్ మీడియా వెట్టింగ్ కంపల్సరీ చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునఃప్రారంభించింది.



## సిటీలో అనంత పద్మనాభ స్వామి సెట్..
# పాట కోసమే పది కోట్లు!

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. "ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.

## థియేటర్‌లో కుబేర టీం.. ధనుష్ భావోద్వేగం!



ఏదో వచ్చామా? నాలుగు సినిమాలు చేశామా? అని కాదు.. చేసిన సినిమా గురించి నలుగురు మాట్లాడుకున్నారా? జనాలు గుండెలో పెట్టుకున్నారా? అనేట్లు ఉండాలి. శేఖర్ కమ్ములకు ఈ విషయం బాగా తెలుసు. అందుకే.. భారీ ఫైట్లు.. విజువల్ ఎఫెక్ట్స్.. భారీ బడ్జెట్ చిత్రాల జోలికి పోడు. సింపుల్‌గా రాసుకున్న కథలతోనే ఊహించని విజయాలు అందుకుని థియేటర్ దగ్గర మ్యాజిక్ చేస్తుంటాడు.

**నాలుగేళ్ల గ్యాప్‌తో మూవీ**

ఇప్పుడదే జరుగుతోంది. ఈయన దర్శకత్వంలో వచ్చిన చివరి చిత్రం లవ్ స్టోరీ. నాగచైతన్య, సాయిపల్లవి కాంబినేషన్‌లో తీసి ఈ మూవీ భారీ సక్సెస్ అందుకుంది. అయినా వెంటనే సినిమా చేయలేదు. నాలుగేళ్ల గ్యాప్ తీసుకుని కుబేరతో వచ్చాడు. ధనుష్‌ను యాచకుడిగా, నాగార్జునను సీబీఐ ఆఫీసర్‌గా చూపించాడు. డబ్బు, స్వార్థం చుట్టూ కథ అల్లుకున్నాడు. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి అంతటా పాజిటివ్ టాక్ వస్తోంది.

**వీడియో వైరల్**

జనాల స్పందన ఎలా ఉందో చూద్దామని శేఖర్, ధనుష్ చెన్నైలోని ఓ థియేటర్‌కు వెళ్లారు. ప్రజల అరుపులు, కేకలు విని ఆనందంతో వారికి కడుపు నిండిపోయింది. ధనుష్ అయితే.. డంపింగ్ యార్డ్‌లో కంపు కొడుతున్నా గంటల తరబడి షూటింగ్ చేసిన కష్టాన్ని మర్చిపోయి భావోద్వేగానికి లోనయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# అతడు చెప్పేదంతా అబద్ధం..
## విమాన ప్రమాద బాధితుడిపై నటి కామెంట్లు



సెలబ్రిటీలు ఏం మాట్లాడాలన్నా, ఎలాంటి పోస్టులు వేయాలన్నా కాస్త ఆచితూచి వ్యవహరించాలి. లేదంటే చిక్కుల్లో పడటం ఖాయం. గాయని, నటి సుచిత్రా కృష్ణమూర్తి ఇప్పుడలాంటి పరిస్థితిలో ఇరుక్కుంది. ఇటీవల జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఒక్కరు మినహా ఫ్లైట్‌లో ఉన్న అందరూ చనిపోయిన సంగతి తెలిసిందే! మృత్యుంజయుడిగా బయటకు వచ్చిన అతడి పేరు విశ్వాస్ కుమార్ రమేశ్. చిన్నపాటి గాయాలతో సంఘటనా స్థలం నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చాడు.

**అతడు చెప్పేది అబద్ధం**

అతడి గురించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు కథనాలు కూడా వ్యాప్తిలో ఉన్నాయి. విశ్వాస్ అబద్ధం చెప్తున్నాడని కొందరు పుకార్లు సృష్టించారు. అది నిజమని నమ్మిన సుచిత్రా కృష్ణమూర్తి ఆ రూమర్స్‌ను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రమేశ్ అన్నీ అబద్ధాలు చెప్తున్నాడు. అదేగనక నిజమైతే అతడికి కఠిన శిక్ష విధించాలి. లేదంటే పిచ్చి ఆస్పత్రిలో వేయాలి అని ట్వీట్ చేసింది.

**ట్వీట్ డిలీట్**

ఇది చూసిన నెటిజన్లు అసత్యాలను ఎందుకు ప్రచారం చేస్తున్నావని విమర్శించారు. ఆయన విమాన ప్రమాదంలోని బాధితుడే అని అహ్మదాబాద్‌లోని ఆస్పత్రి అధికారులే ధృవీకరించాక ఇంకేంటి సమస్య? అని ప్రశ్నించారు. దీంతో తప్పు తెలుసుకున్న సుచిత్ర.. వెంటనే సదరు ట్వీట్‌ను డిలీట్ చేసింది. తప్పుడు వార్తలను ఎందుకు ప్రచారం చేస్తారో ఆ దేవుడికే తెలియాలి. ఏదేమైనా దాన్ని పోస్ట్ చేసినందుకు సారీ అని ట్వీట్ చేసింది.

**నటిగా..**

గాయని, నటి, రచయిత, చిత్రకారిణి.. ఇలా అన్ని రంగాల్లో అందెవేసిన చేయి సుచిత్రా కృష్ణమూర్తిది. 1991లో వచ్చిన మలయాళ చిత్రం 'కిలుక్కింపెట్టి'తో జయరామ్ సరసన హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తర్వాత తమిళ చిత్రం 'శివరంజని'లో టైటిల్ రోల్ పోషించి ఆకట్టుకుంది. తర్వాత షారుక్ ఖాన్ కభీ హా కభీ నా, జజ్‌బాత్, రోమియో అక్బర్ వాల్టర్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది. 'గిల్టీ మైండ్స్' వెబ్ సిరీస్‌లోనూ నటించింది. 1999లో తనకంటే 30 ఏళ్లు పెద్దవాడైన దర్శకుడు శేఖర్‌కపూర్‌ను వివాహమాడింది. వీరికి కావేరీ అనే కూతురు జన్మించింది. 2007లో సుచిత్రా శేఖర్ విడాకులు తీసుకున్నారు.

# ఇండస్ట్రీలో ఇదే జరుగుతోంది..
## ఆ బ్రేకప్ వల్ల మూడేళ్లపాటు బాధలోనే..

ప్రేమలో మోసపోయానంటోంది తెలుగు హీరోయిన్ అనన్య నాగళ్ల (Ananya Nagalla). తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీలో ఉన్నప్పుడు నాకు బ్రేకప్ జరిగింది. ఆ సమయంలో నా మనసుకు, మెదడుకు, చేతలకు సంబంధమే లేకుండా పోయింది. అతడికి ఫోన్ చేయడం ఇష్టం లేకపోయినా నాకు తెలీకుండానే ఫోన్ చేసేవాడిని. ఎందుకు చేశానో అర్థమయ్యేది కాదు. రెండు, మూడేళ్లపాటు చాలా బాధపడ్డాను.

### కేరవాన్‌లో ఏడ్చేసి..

కానీ, చేసే పనిపై దాని ప్రభావాన్ని పడనివ్వలేదు. రాత్రంతా ఏడ్చి ఉదయాన్ని జిమ్‌కు వెళ్లిపోయేదాన్ని. కేరవాన్‌లో ఏడ్చేసి.. ఏం జరగనట్లు కళ్లు తుడుచుకుని నవ్వుకుంటూ బయటకు వచ్చేదాన్ని. ఈ బాధలో నుంచి బయటకు వస్తానా? లేదా? అనుకున్నాను. తర్వాత ఇదంతా ఒక మాయ అని తెలుసుకుని బయటపడ్డాను అని తెలిపింది.

### తెలుగమ్మాయికి అవకాశాలు తక్కువ?

తెలుగమ్మాయిలకు వస్తున్న అవకాశాల గురించి అనన్య మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీ అంటేనే ఒక బిజినెస్. హిట్స్ వస్తేనే మార్కెట్ పెరుగుతుంది, అప్పుడే హీరోయిన్లను సినిమాలో పెట్టుకుంటారు. వైష్ణవి చైతన్య విషయంలో అదే జరిగింది. మంచి ప్రాజెక్ట్స్ ఇచ్చారు. కానీ, వేరే ఇండస్ట్రీ నుంచి వచ్చిన అమ్మాయి బ్లాక్‌బస్టర్ హిట్ కొడితే వచ్చినన్ని అవకాశాలు.. తెలుగమ్మాయి బ్లాక్‌బస్టర్ హిట్ కొడితే రావట్లేదు. ఇదే నిజం. హిట్స్ ఉన్నా ఎందుకు మంచి అవకాశాలు రావడం లేదని కొంతకాలం బాధపడ్డాను. తర్వాత నాకోసం నేను మార్కెటింగ్ చేసుకోవడం మొదలుపెట్టాను.

### నాకు నేనే మార్కెటింగ్

సినిమాల్లో యాక్ట్ చేసి వదిలేయకుండా వాటి ప్రమోషన్స్‌పై ఎక్కువగా ఫోకస్ చేశాను. దానివల్ల నాకంటూ ఫీమేల్ ఓరియంటెడ్ స్క్రిప్టులు వస్తున్నాయి. బాలీవుడ్‌లో ఉమెన్ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నాను. తెలుగులోనూ రెండు చిత్రాలు చేస్తున్నాను అని చెప్పుకొచ్చింది. మల్లేశం సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన అనన్య.. వకీల్ సాబ్, తంత్ర, శాకుంతలం వంటి చిత్రాల్లో నటించింది. పొట్టేల్ సినిమాకుగానూ గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకుంది.






## మగవాళ్లు అర్ధరాత్రుళ్లు తలుపులు కొట్టేవారు..
# తప్పించుకోడానికి ఏం చేశానంటే...

ఆమె మన హైదరాబాద్‌కు చెందిన అమ్మాయే. ప్రస్తుతం బాలీవుడ్‌లో స్థిరపడింది. అందాల కిరీటాన్ని గెలుచుకున్న దియామీర్జా (Dia Mirza) ఇప్పుడు మంచి పేరున్న బాలీవుడ్ నటిగా కొనసాగుతోంది. తమిళ సినిమాల్లో ఓ చిన్న పాత్రలో, బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన దియా, 2000లో మిస్ ఆసియా పసిఫిక్ ఇంటర్నేషనల్ కిరీటాన్ని గెలిచిన తరువాత, హిందీ సినిమాల్లో అడుగుపెట్టింది. ఆమె ఆర్. మాధవన్ సరసన తొలి చిత్రం రెహ్నా హై తెరే దిల్ మేన్‌లో నటించింది. ఈ నేపథ్యంలో ఇటీవల దియా మీర్జా తన సినీ ప్రస్థానంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల గురించి ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడింది. ఒక అవుట్‌సైడర్‌గా ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఎంత కష్టం అనేది చెప్పిన దియా, 'ఆ ప్రయాణాన్ని వివరించాలంటే ఓ పుస్తకమే రాయాల్సి వస్తుంది. అది చాలా భయంకరం, కఠినం.' అని చెప్పింది. ఇండస్ట్రీలో పుష్కలంగా అవకాశాలు ఇచ్చే పరిస్థితులు ఉన్నప్పటికీ, అవి బలమైన బ్యాగ్రౌండ్ ఉన్న వారికే ఇచ్చే పరిస్థితులు ఉండేవని ఆమె చెప్పారు. ''పలు సినిమాలు నాకు ఇవ్వకుండా ఇండస్ట్రీ బ్యాకింగ్ ఉన్న నటీమణులకు ఇచ్చారు. అదీ నిజం'' అన్నారామె. ఇప్పటి సినిమాల్లో మహిళా పాత్రల రాస్తున్న రచయితలు, కథనాలు మెరుగయ్యాయని ఆమె అభిప్రాయపడ్డారు. 'గతంలో కొన్ని పాత్రలు ఎలా రాసేవారో, అవి ఎంత రెగ్రెసివ్‌గా ఉండేవో, నాకు ఇప్పుడు తెలుస్తోంది. అప్పట్లో సీన్ చేయడం మీదే దృష్టి ఉండేది. అప్పటి జీర్ణించుకుపోయిన మనస్తత్వం, పురుషాధిపత్యం ఎలా ఉండేదో ఇప్పుడు అర్థమవుతోంది. ఈ అవగాహన వల్లే ఇప్పుడు సరైనవి ఎంచుకోగలుగుతున్నాను' అని ఆమె పేర్కొంది. అంతేకాదు..ఒకప్పుడు మగవాళ్లు అర్ధరాత్రుళ్లు తారల రూమ్ తలుపులు కొట్టేవారంటూ ఆమె చెప్పకనే చెప్పడం విశేషం. అలా అర్ధరాత్రుళ్లు తలుపులు కొట్టేవారి నుంచి తప్పించుకోవడం కోసం తన హెయిర్‌డ్రెస్సర్‌తో గదిని పంచుకున్నానని ఆమె గుర్తు చేశారు. 'చాలా మంది నటీమణులకు అలాంటి సమయంలో తల్లిదండ్రుల మద్దతు ఉండేది. నా వెంట మాత్రం ఎప్పుడూ నా టీమ్ హెయిర్‌డ్రెస్సర్, మేకప్ ఆర్టిస్ట్, స్పాట్‌బాయ్ లు మాత్రమే ఉండేవారు. వాళ్లే నా రక్షక వలయం,' అని చెప్పింది. ''ప్రసాద్ అన్నా నా స్పాట్‌బాయ్‌గా ఎన్నో సంవత్సరాలు నా వెంట ఉన్నాడు. కోవిడ్ సమయంలో ఆయనను కోల్పోయాను. నా హెయిర్‌డ్రెస్సర్ 16-17 సంవత్సరాలు నా కోసం పని చేసింది. అలా వారితో కలిసి నేను నా చుట్టూ ఒక ప్రపంచాన్ని నిర్మించుకున్నాను,'' అని చెప్పిన దియా వివరించింది. ప్రస్తుతం దియా మీర్జా, నెట్ఫ్లిక్స్ చిత్రం నాదానియాన్లో నటించింది. ఈ సినిమాలో ఖుషీ కపూర్, ఇబ్రహీం అలీ ఖాన్ తదితరులు ఉన్నారు.

# నెలకు ఆరున్నర లక్షలా?..
## ఖరీదైన ఫ్లాట్ తీసుకున్న స్టార్ హీరో భార్య!



ఈ రోజుల్లో నెలకు లక్ష రూపాయలు అద్దెకు ఇల్లు తీసుకోవడం అంటే ఎవరైనా సరే నోరెళ్లబెట్టాల్సిందే. కానీ సినీతారల విషయానికొస్తే ఈ లెక్క మారుతుంది. వారు మినిమం లక్షకు పైగానే రెంట్ ఉంటుంది. ఇక పెద్ద పెద్ద స్టార్స్ అయితే రెండు, మూడు లక్షల పైమాటే. అయితే తాజాగా స్టార్ హీరో ఆర్ మాధవన్ భార్య సరిత ఏకంగా ఆరున్నర లక్షలకు ఓ అపార్ట్‌మెంట్‌ను లీజ్‌కు తీసుకుంది. ముంబయిలోని ఖరీదైన ప్రాంతమైన బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో నెలకు దాదాపు రూ.6.50 లక్షలు చెల్లించేలా ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. ఇందుకోసం దాదాపు రూ.39 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించినట్లు తెలుస్తోంది. ముంబయిలో అత్యంత డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో బాంద్రా ఒకటి. ఈ ఏరియాలో పలువురు బాలీవుడ్ ప్రముఖులు నివాసమున్నారు.

ఇక మాధవన్ సినిమాల విషయానికొస్తే మా అనే చిత్రంలో నటించారు. కాజోల్ లీడ్ రోల్ పోషించింది. ఈ చిత్రంలో కేవలం అతిథి పాత్రలో కనిపిస్తాడు. దీంతో పాటు ఫాతిమా సనా షేక్ జంటగా ఆప్ జైసా కోయి అనే సినిమాలో కూడా నటించారు. ఈ రొమాంటిక్ సినిమా జూలై 2025లో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. మాధవన్ చివరిసారిగా అక్షయ్ కుమార్, అనన్య పాండే జంటగా నటించిన చిత్రం కేసరి చాప్టర్2లో కనిపించాడు. అంతే కాకుండా ఈ ఏడాది ప్రారంభంలో మాధవన్ ప్రధాన పాత్రలో నటించిన హిసాబ్ బరాబర్ విడుదలైంది . అశ్వని ధర్ డైరెక్ట్ చేసిన ఈ మూవీలో కీర్తి కుల్హారి, నీల్ నితిన్ ముకేశ్, రష్మీ దేశాయ్, ఫైజల్ రషీద్ కీలక పాత్రల్లో నటించారు. ఈ థ్రిల్లర్ సినిమా నేరుగా ఓటీటీలో రిలీజైంది. జనవరి 24 నుంచి జీ5లో ప్రసారమవుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com